ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 24 మే 2025

ప్రభుత్వ పథకాలు గిరిజనులకు అందాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న అన్ని పథకాలు గిరిజనులకు తప్పనిసరిగా అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి దార్తి అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్-2025 పథకం అమలుపై మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే ఈ కార్యక్రమంపై గిరిజనులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 15 నుంచి 30వ తేది వరకు జిల్లాలో విస్తృత ప్రచార అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అదే సందర్భంలో జిల్లాలోని గిరిజనులకు ఆధార్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్‌కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్, జన్‌ధన్ అకౌంట్లను తప్పనిసరిగా ఇప్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, గిరిజన సంక్షేమశాఖ అధికారి తేజస్విని, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్

లక్కిరెడ్డిపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలని, ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అనంతపురం ఈడిగపల్లి, దప్పేపల్లి హరిజనవాడ గ్రామాల్లో పర్యటించి ఆయా పనులపై ఆరాతీశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త సేకరణకు వెళ్లే గ్రీన్ అంబాసిడర్లతో కలిసి పంచాయతీ సెక్రటరీ ప్రతి రోజు కనీసం 100 ఇళ్లకు వెళ్లాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే షోకాజు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించిన అనంతపురం పంచాయతీ సెక్రటరీ మధుసూదన్, మద్దిరేవుల పంచాయతీ సెక్రటరీ రజనీశ్‌రెడ్డిలను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారికి ఇరుపక్కల ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు.

పుంగనూరు.. ఇక 'అన్నమయ్య'లోనే

● నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం


● ఆ నియోజకవర్గంలోని ఆరు మండలాలూ విలీనం

కలికిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు నియోజకవర్గం ఎట్టకేలకు అన్నమయ్య జిల్లాలో విలీనం కానుంది. ఈ మేరకు ఆరు మండలాలతో సహా పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో చేరుస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నియోజకవర్గంలోని ఆరు మండలాలను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. దీనికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, సమస్యలు, సలహాలను 30 రోజుల్లోగా చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లకు రాతపూర్వకంగా తెలియజేయాలని కూడా కోరింది. పార్లమెంటు ప్రామాణికంగా కొత్త జిల్లాల ఏర్పాటుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం సంకల్పించిన విషయం తెలిసిందే. అయితే రాజంపేట వరకు వచ్చేసరికి పుంగనూరు నియోజకవర్గాన్ని మినహాయించి అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేశారు. రాజకీయ కారణాలతో ఈ విధమైన వైరుధ్యం చోటు చేసుకున్నట్లు విమర్శలు వచ్చాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీన్ని సరిచేస్తూ పార్లమెంటు పరిధిలోనే జిల్లాకు కొత్త పరిధిని నిర్ణయించింది. కాగా ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని పలమనేరు రెవెన్యూ డివిజను పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాలతో పాటు చిత్తూరు డివిజన్‌లో వున్న రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను మదనపల్లె డివిజన్‌లోకి బదలాయిస్తున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో వివరించింది. దీంతో అన్నమయ్య జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కానున్నాయి. కాగా ప్రస్తుతం మదనపల్లె డివిజన్‌లో 11 మండలాలు, రాయచోటి డివిజన్‌లో 10, రాజంపేట డివిజన్‌లో 9.. మొత్తం 30మండలాలతో అన్నమయ్య జిల్లా వుంది. తాజా చేర్పులతో జిల్లాలో 36 మండలాలు కానున్నాయి.

'అనంత'రుచులు

● అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలు

● శాస్త్రవేత్తల పరిశోధనలతో నూతన వంగడాలు



6

'మహా'జోరు

● మహానాడులో లోటుపాట్లకు తావివ్వద్దు

● అన్ని వసతులు ఏర్పాటు చేయాలి

● తొలి రెండురోజులు 25వేల మంది హాజరు

● భోజనం, పార్కింగ్ వసతులపై.. మహానాడు కమిటీ సుదీర్ఘంగా చర్చ



మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీఎం కటౌట్

ముమ్మరంగా సాగుతున్న మహానాడు పనులు



(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ నేతలు నిర్ణయించారు. మహానాడుకు గడువు దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం మంత్రులు అనగాని సత్యప్రసాద్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, గుండు సంధ్యారాణి జిల్లాకు చేరుకున్నారు. వీరితో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎన్.అమర్‌నాథరెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రవిచంద్రయాదవ్, ఆలపాటి రాజా, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి తదితరులు మహానాడు ఏర్పాట్లను పరిశీలించారు.

గురు, శుక్రవారాల్లో వర్షాలు లేకపోవడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలి రెండురోజులు 27, 28తేదీల్లో నిర్వహించే ప్రతినిధుల సమావేశానికి 23వేల మంది హాజరు కానున్నారు. ఆ సమావేశ వేదిక పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇక చివరి రోజున ఐదులక్షల మందితో బహిరంగసభ నిర్వహించనున్నారు. ఆ వేదిక పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. చంద్రబాబునాయుడు మూడురోజుల పాటు ఇక్కడే బస చేయనున్నారు. దీంతో సీఎం క్యాంపు కార్యాలయ వేదికను నిర్మిస్తున్నారు. భోజనశాల, ఎగ్జిబిషన్, రక్తదానశిబిరం పనులన్నీ 70 శాతానికి పైగా పూర్తయ్యాయి.

మహానాడు ఏర్పాట్ల నిర్వహణపై శుక్రవారం కడప ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో , మహానాడు వేదిక వద్ద వివిధ కమిటీలలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. మూడురోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి వసతి, భోజన సౌకర్యం, ట్రాఫిక్‌పై సుదీర్ఘంగా చర్చించారు. మహానాడుకు ఎంతమంది వస్తున్నారు, తొలి రెండురోజులు ఎంతమంది వస్తున్నారు.. స్థానికంగా వారికి వసతి, భోజనాలు ఏర్పాటు చేయడం, చివరి రోజు బహిరంగసభకు వచ్చే జనాలకు ఒకే చోట భోజనం పెట్టాలా లేక ప్యాకెట్ల ద్వారా ఇవ్వాలా అన్నదానిపై మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో చర్చ జరిగింది. తొలి రెండురోజులు 25వేల మంది హాజరవుతారని భావిస్తున్నారు. వీరందరికీ జిల్లావ్యాప్తంగా పలుప్రాంతాల్లో వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. రకరకాల వంటకాలు అందించాలని నిర్ణయించారు. బహిరంగసభకు వచ్చే జనాలకు ఆయా ప్రాంతాల్లో భోజనాలు ఏర్పాటు చేయాలా, లేక ప్యాకెట్ల రూపంలో ఇవ్వాలా అనే దానిపై చర్చ నిర్వహించారు. బహిరంగసభ రోజు వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలంటే రింగురోడ్డులో అక్కడక్కడా డివైడరు తొలగించి తరువాత వాటిని నిర్మించాలని నిర్ణయించారు.

కడప పసుపుమయం

మహానాడు వేళ కడప నగరాన్ని పసుపుమయం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే రాజంపేట, కడప రహదారి, కడప-మైదుకూరు, కడప-కమలాపురం రింగురోడ్డు చుట్టూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇతర టీడీపీ నేతలతో ఉన్న ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. కడప నగరంలోని కూడళ్లన్నీ పసుపుమయం చేస్తున్నారు.

వైభవంగా నిర్వహిస్తాం

మహానాడును మూడురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని మంత్రి గుండు సంధ్యారాణి అన్నారు. పనులన్నీ త్వరితగతిన పూర్తవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ కడప జగన్ అడ్డా కాదు, ఇది జనం గడ్డ అన్నారు. జనం ఓట్లేస్తేనే మేం ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేది. అంతే తప్ప ఇది ఎవరి గడ్డా కాదన్నారు. కడపలో మహానాడు నిర్వహించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా

కడప రింగురోడ్డు 35 కిమీ ఉంది. చిత్తూరు-కడప-కర్నూలు జాతీయ రహదారి అలాగే కడప-రేణిగుంట-చెన్నై రహదారులు ఈ రింగు రోడ్డునుంచే వెళుతుంటాయి. మహానాడును రాయచోటి రింగు రోడ్డు నుంచి పులి వెందుల వైపు వెళ్లే రింగు రోడ్డు మీదుగా పడమర వైపు నిర్మిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక వేళ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే కర్నూలు-చిత్తూరు-రేణిగుంట వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగసభకు 50వేలకు పైగా వాహనాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. దీంతో మహానాడు వేదిక సమీపంలోనే ఇటు పులివెందుల వైపు వెళ్లే రహదారి, అటు రాయచోటి వైపు వెళ్లే రహదారికి అనుకుని వేదిక వద్ద సుమారు 150 ఎకరాల్లో పార్కింగ్ స్థలం కేటాయించారు. అక్కడ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలి రెండురోజులు జరిగే ప్రతినిధుల సభకు 23వేల మందికి ఆహ్వానం పంపారు. అలాగే ఎమ్మెల్యేలు, వారి అనుచరులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని లాడ్జిలు, ఫంక్షన్‌హాల్స్, రిసార్ట్స్, ప్రభుత్వ అతిథిగృహాలు బుక్ చేశారు. కడప జిల్లాతో పాటు సమీపంలోని తిరుపతి, నంద్యాల, కర్నూలులో వసతి కోసం గదులు తీసుకున్నారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎన్.అమర్‌నాథరెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తదితరులు

మహానాడుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

కడప క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): మహానాడు సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ ఈజీ శోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులకు దిశ నిర్దేశనం చేశారు. మహానాడుకు పలువురు వీఐపీలు, వీవీఐపీలు, పెద్ద ఎత్తున ప్రజలు రానునన్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



మదనపల్లె ఎఫ్ఆర్వో పెన్షన్‌లో 5శాతం కోత

● వడ్డీ సహా దుర్వినియోగమైన సొమ్ము రికవరీ

కలికిరి, మే 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఫారెస్టు రేంజి పరిధిలో సామాజిక అటవీ పెంపకం విభాగంలో జరిగిన అక్రమాలకు ఫారెస్ట్ రేంజి అధికారి ఎం.రెడ్డెప్పను బాధ్యుడుగా నిర్ధారిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సామాజిక వనాల పెంపకం కోసం కేటాయించిన నిధులతో చేసిన పనుల్లో అక్రమాల కారణంగా మొత్తం రూ.12,45,494లు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 2018-19లో ఈ పనులు జరిగాయి. 2019లో రెడ్డెప్ప పదవీ విరమణ చేశారు. పలు దఫాలుగా చీఫ్ కన్జర్వేటర్ పర్యవేక్షణలో జరిగిన విచారణ అనంతరం అప్పట్లో రేంజి అధికారిగా పనిచేసిన ఎం.రెడ్డెప్ప రూ.1,60,586లు దుర్వినియోగమైనట్లు తేల్చారు. దీనిపై ఆయన సమర్పించిన వివరణలేవీ సహేతుకంగా లేకపోవడంతో చివరికి ఆయన నెలవారీ పెన్షన్ నుంచి ఐదేళ్ల పాటు 5 శాతం వంతున కోత విధించారు. దుర్వినియోగమైన సొమ్మును వడ్డీ సహా రికవరీ చేసేందుకు కూడా ఆదేశిస్తూ పర్యావరణ, అటవీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

రైతుల సమస్యలకు పరిష్కారం చూపుదాం

● పెట్టుబడుల తగ్గింపుపై దృష్టి సారించాలి

● పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో అధికారులు, శాస్త్రవేత్తలు



రాయలసీమ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కేటీ రమణ

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కార దిశగా పనిచేయాలని ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ కేటీ రమణ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాయలసీమ జోన్ ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు వీలవుతుందన్నారు. ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలను ప్రాంతాల వారీగా నిర్వహిస్తున్నారు. జూన్ మొదటి వారంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించి ప్రాంతీయ సదస్సుల ద్వారా వచ్చిన సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశాల ద్వారా అంతరాలను గుర్తించి వచ్చే ఏడాదిలో చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. రైతులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేస్తామని తెలిపారు. విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ రైతులు తాము ఎదుర్కొంటున్న ఉద్యాన పంటల సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని సూచించారు. సహ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ మధుమతి మాట్లాడుతూ 5 ఏళ్ల తర్వాత పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ సంచాలకుడు రవిచంద్రబాబు మాట్లాడుతూ రైతులు పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. నెల్లూరు ఉద్యాన శాఖ సంచాలకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిమ్మ, మామిడి ఇతర ఉద్యాన పంటలలో వచ్చే తెగుళ్లను ప్రస్తావించారు. తిరుపతి జిల్లా ఉద్యాన శాఖ సంచాలకుడు దశరథరామిరెడ్డి, సత్యసాయి జిల్లా ఉద్యాన శాఖ సంచాలకుడు చంద్రశేఖర్, వైఎస్ఆర్ జిల్లా సంచాలకురాలు సుభాషిణి, చిత్తూరు జిల్లా సంచాలకుడు మధుసూదన్ రెడ్డి, అనంతపురం జిల్లా సంచాలకుడు ఫరోజ్‌ఖాన్, నాగరాజు, నంద్యాల జిల్లా సంచాలకుడు నాగరాజు, కడప, నెల్లూరు, అనంతపురం జిల్లాల ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్, అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం హెడ్ కేఎం యువరాజ్, పెట్లూరు నిమ్మ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, అనంతపురం, మహానంది, పులివెందుల, గుంటూరు, ఉద్యాన పరిశోధన స్థానాల అధిపతులు సుబ్రహ్మణ్యంరెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 274 మలేరియా కేసులు

● డీఎంవో రామచంద్రారెడ్డి

6

చౌకధర దుకాణాలకు సకాలంలో సరుకులు అందించాలి

● జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం

6



ఇటీవల రైల్వేకోడూరు మండలంలో నేలకూలిన అరటి తోట

పగబట్టిన ప్రకృతి

● నేలకూలుతున్న పండ్లతోటలు

● అప్పుల్లో కూరుకుపోతున్న అన్నదాతలు

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): రైతులపై ప్రకృతి పగబడుతోంది. అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టితో రైతులు కుదేలవుతున్నారు. ప్రతి ఏటా పెనుగాలులు, అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని తెస్తున్నాయి. తీరా పంట చేతికొస్తున్న సమయంలో వీస్తున్న పెనుగాలులకు అరటి, బొప్పాయి, మామిడి రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువగా మామిడి, అరటి, బొప్పాయి తదితర పండ్ల తోటలను రైతులు సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే ప్రతి ఏటా మార్చిలో అరటి, ఏప్రిల్ నుంచి మామిడి సీజన్ మొదలవుతుంది. బొప్పాయి పంట జూన్ నుంచి ప్రారంభమవుతుంది. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో మామిడి 20 వేల హెక్టార్లు, అరటి 16 వేల హెక్టార్లు, బొప్పాయి పంట 17 వేల హెక్టార్లల్లో రైతులు సాగు చేస్తున్నారు. ప్రతిఏటా మామిడి, అరటి, బొప్పాయి సీజన్‌లలో ధరలు అటు ఇటుగా ఉంటాయి. చీడపీడలు, ధరలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర వాటి వల్ల తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాదిలో పలుసార్లు పెనుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో అరటి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులకు వచ్చే పరిహారం పంటల ఎత్తివేతకు కూడా సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. మామిడి పంటలో దిగుబడి తీసుకోవాలంటే ఎకరాకు రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అరటి పంటకు ఎకరాకు ఖర్చు రూ.50 వేలు, బొప్పాయి ఎకరాకు ఖర్చు రూ.40 వేలు అవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటల పైన చేసే ఖర్చు కూడా ప్రకృతి వైపరీత్యాల వల్ల రావడం లేదని, వ్యాపారుల నుంచి తెచ్చి అప్పులకు వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో మంచి డిమాండ్ ఉన్న పంటలు ఉన్నాయి. దక్షిణ భారత దేశంలో ఇక్కడి మామిడి, అరటి, బొప్పాయికి మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు మామిడి, అరటి, బొప్పాయి కాయలను ఇటు రైతులు, అటు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. కాగా 2024-25 సంవత్సరానికి 300 మంది రైతులకు చెందిన 155.8 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిందని ఉద్యాన శాఖాధికారులు తెలిపారు. మామిడి పంటను పర్సెంటేజీ ప్రకారంగా తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అధికారులు చెబుతున్నారు. అరకొర నష్టపరిహారం ప్రభుత్వాలు ఇస్తుండడంతో సరిపోవడం లేదని రైతులు అంటున్నారు. అరటికి ఎకరాకు రూ.50 వేలు, మామిడికి ఎకరాకు రూ.20 వేలు, బొప్పా యికి ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి ఏటా నష్టాలు చవిచూస్తున్నాము



ప్రతి ఏటా సంభవించే ప్రకృతి వైపరీత్యాలతో అరటి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. చేసిన అప్పులు తీరడం లేదు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం దేనికీ సరిపోవడం లేదు. రైతులపై పెనుగాలులు పగబట్టాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం పరిహారం పెంచి ఆదుకోవాలి.

- సుబ్బయ్య, అరటి రైతు, రైల్వేకోడూరు

ఆత్మహత్యలే శరణ్యం



ఏటా సంభవించే ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉంది. కష్టపడి పంటలను సాగు చేస్తే నష్టాలను చవి చూస్తున్నాము. దుక్కి దున్ని, సాలు తీసి, కూలీలతో పనులు చేయించి, పురుగు మందులు పిచికారీ చేయించి దిగుబడి వచ్చిన సమయంలో గాలి తన్నుకునిపోతోంది. ప్రభుత్వాలు రైతుల గురించి ఆలోచించి నిర్ణయం తీసుకుని ఆదుకోవాలి.

- కొండయ్య, అరటి రైతు, రైల్వేకోడూరు



నేలరాలిన మామిడి కాయలు

అనంత రుచులు



ప్రస్తుతం పెద్ద భవనంలో కొనసాగుతున్న పరిశోధన కేంద్రం

- అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలు
- శాస్త్రవేత్తల పరిశోధనలతో నూతన వంగడాలు
- త్వరలో విడుదలకానున్న పలు రకాల మామిడి వంగడాలు
- 90 ఏళ్లుగా రైతు సేవలో పరిశోధన స్థానం

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలను పండిస్తున్నారు. ఇప్పటికే ఆరు రకాల కొత్త వంగడాలను విడుదల చేసి విజయవంతం చేశారు. త్వరలో పలు రకాల మామిడి కొత్త వంగడాలను విడుదల చేయనున్నారు. పరిశోధన స్థానం 90 ఏళ్లుగా రైతు సేవలో ఉంది.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో పండ్ల తోటలు అత్యధికంగా ఉన్నాయని బ్రిటీష్ దొరలు (మద్రాసు ప్రావిన్స్)లో గుర్తించి అనంతరాజుపేటలో 1935లో పరిశోధన స్థానం ఏర్పాటు చేశారు. పరిశోధన స్థానానికి మొట్టమొదటి సూపరిండెంట్‌గా కేసీ నాయక్ వ్యవహరించారు. 1960లో ఐకార్ ఆర్థిక సాయంతో అప్‌గ్రేడ్ అయింది. పరిశోధన స్థానం లక్ష్యం ఉష్ణ మండల పండ్ల తోటలు అభివృద్ధితో పాటు తెగుళ్లు, వ్యాధుల నియంత్రణ చేసి మెరుగుపచడంపై 1957-66 మధ్య పరిశోధనలు ప్రారంభించారు.

తొమ్మిది దశాబ్దాలుగా..

ఉష్ణమండల పండ్ల పంటలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలపై పరిశోధనలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని మార్గదర్శక సంస్థలో ఈ కేంద్రం ఒకటిగా ఉంది. పండ్ల పంటలకు సాంకేతికలను అభివృద్ధి చేయడం, అధిక దిగుబడితో హైబ్రీడ్లను విడుదల చేయడం మామిడి ఇతర పంటలలో మంచి నాణ్యత గల పండ్లను రూపొందించడం లాంటి అనేక ఘనతలను సాధించింది. 90 సంవత్సరాలకు పైగా ఈ కేంద్రం స్థానం పండ్ల తోటల అవసరాలను తీరుస్తూ ఫలవంతమైన పరిశోధనలు చేసింది. ఉద్యాన పంటలపై పనిచేయడానికి హార్టికల్చర్ కీటకశాస్త్ర విభాగం, తెగుళ్ల విభాగాలు ఈ కేంద్రంలో ఉన్నాయి. ఉద్యాన కళాశాల స్థాపించిన తర్వాత ఉద్యాన పరిశోధన కేంద్రం, ఉద్యాన కళాశాలలో 2010 డిసెంబరులో విలీనం అయింది.


నిరంతర పరిశోధనలు

2012 నుంచి కూరగాయలు, పూలు, వార్షిక పంటలైన బొప్పాయి, అరటిపై పరిశోధనే ప్రధాన ఆదేశంతో పనిచేయడం ప్రారంభించారు. ఉద్యాన పరిశోధన కేంద్రం ద్వారా నీలీషాన్, నీలుద్దీన్, నీల్‌గోవా, స్వర్ణజహంగీర్, ఏయూ రుమాణి, కేఎంహెచ్-1 మామిడి రకాలను విడుదల చేశారు. కోడూరు-గోవా జహంగీర్, ఖాదర్-జహంగీర్, పంచదారకలశ-విల్లార్డ్, పదిరి-అలంపూర్‌బనేషాన్, మల్లుబా-జహంగీర్, అంబలది-అలంపూరిబేనీషాన్, సువర్ణరేఖ-పదిరి అనే రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. త్వరలో వీటిని విడుదల చేయడానికి శాస్త్రవేత్తలు పరిశోధలు ముమ్మరం చేస్తున్నారు. మామిడికాయల రంగు, రుచి, వాసన, నాణ్యతలను పరిశీలిస్తున్నారు. ఇంకా చాలా కొంగొత్త వంగడాలపై పరిశోధనలు నిరంతరాయంగా చేస్తున్నారు. పరిశోధన కేంద్రం ద్వారా పదేళ్లగా పులుసు నిమ్మ, బాలాజీ నిమ్మ, పీకేఎం-1 మొక్కలను రైతులకు అందిస్తున్నారు. అలాగే టిష్యూకల్చర్ ద్వారా నాణ్యమైన అరటి. పచ్చ అరటి, గ్రాండ్-9 మొక్కలను రైతులకు అందిస్తున్నారు.

తెగుళ్లు ఉండవు

ఇక్కడ అందించే పండ్ల మొక్కలకు ఎటువంటి వ్యాధులు, తెగుళ్ల ఉండవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మొక్కలను తీసుకుని సాగుచేస్తున్న రైతులకు మంచి సూచనలు, సలహాలు తీసుకుని దిగుబడులు చేస్తున్నారు. అదే కాకుండా ఎప్పుడూ వినిపించని, చూడని మామిడి రకాలను ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన కళాశాల వారు ప్రదర్శన చేస్తున్నారు. పరిశోధనలు విస్తరించడం, శాస్త్రవేత్తలు, సిబ్బంది పెరగడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల వ్యవయంతో పెద్ద భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

ఏటా కాపునిచ్చే మామిడిని అందిస్తాం



ప్రతి ఏటా కాపునిచ్చే మామిడిని రైతులకు అందిస్తాం. కాయ నాణ్యత, రంగు, రుచి, వాసనతో పాటు మంచి దిగుబడి వచ్చే రకాలపై పరిశోధనలు చేస్తున్నాము. గతంలో కొన్ని రకాలను మాత్రమే విడుదల చేశారు. కొత్త వంగడాలను ఎంచుకుని ఇతర ప్రాంతాల నుంచి కొమ్మలను తీసుకుని వచ్చి వాటిని సంపర్కం చేసిన తర్వాత వాటి పై పరిశోధనలు చేస్తున్నాము. త్వరలో కొన్ని మామిడి రకాలను విడుదల చేస్తాం.

- ఎం.శివప్రసాద్, ఉద్యాన కళాశాల ప్రధాన మామిడి శాస్త్రవేత్త

పరిశోధనలు వేగవంతం చేస్తున్నాం



పరిశోధనలు వేగవంతం చేస్తున్నాము. కావాల్సినంత వనరులు ఉన్నాయి. మంచి నాణ్యత ప్రమాణాలు కల్గిన మొక్కలను రైతులకు అందిస్తున్నాము. ఉద్యాన పరిశోధన కేంద్రం మొత్తం 300 ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. దీనికి సాగు నీరు అందించడానికి తగిన సామర్థ్యం ఉంది. పరిశోధనలకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయి. రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు ఇస్తున్నాము.

- కేఎం యువరాజు, ప్రధానశాస్త్ర వేత్త, అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం

ఇవీ మామిడి రకాలు





పరిశోధన కేంద్రంలో కొత్తపల్లె కొబ్బరి, పానకాలు, చిన్నరసం, పెద్దరసం, చెరుకురసం, పంచదారకలస, బెంగుళూర, జహంగీర్, బేనీషాన్, హిమాంపసందు, పెద్దనీలం, వికారాబాద్, పాపారావుగోవా, విల్లార్డ్, కాలేపాడు, మనోరంజన్, దశేరి, కోడూరు గోవా, పెద్దఖాదర్, కేసర్, సఫేదా, నీలం, పండూరి మామిడి, చిన్నసువర్ణరేఖ, సువర్ణరేఖ, పులిహోరా, పునాస, అల్ఫాన్సో హైదర్, ప్రొద్దుటూరు అవకాయ, మహమూద్ వికారాబాద్, అచార్‌పసంద్, యలమంద, అలీపసంద్, గద్దె మామిడి, అమ్రపాలి, అంబలవి-అలంపూర్ బనేషన్, మల్గూవ-జహంగీర్, మంజీరా, మల్లిక, పదిరి-అలంపూర్‌బనేషన్, పంచాదారకలస-విల్లార్డ్, రత్న, ప్రభాశంకర్, ఖాదర్-జహంగీర్, అలంపూర్-బనేషన్-మల్గూవ, సువర్ణరేఖ-పదిరి, కోడూరు గోవా- జహంగీర్ అనే మామిడి రకాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిపై పరిశోధనలు సాగుతున్నాయి. ఇక్కడ పండే మామిడి కాయలు రుచి, రంగు, వాసన, నాణ్యత కల్గి ఉంటాయి. పరిశోధనలు పూర్తి చేసిన తర్వాత వాటిని రైతులకు అందిస్తారు.









అదాని ఎనర్జీకి మరో 42 ఎకరాలు

కలికిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కొండాపురం మండలంలో అదాని గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో వేయి మెగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పనున్న పంప్‌డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టుకు మరో 41.99 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొండాపురం మండలం కె.బొమ్మేపల్లె గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 309/2, 310లలో 41.99 ఎకరాలను అదనంగా కేటాయించారు. న్యూ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ మార్గదర్శకంలో ఇక్కడ అదాని గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. గతంలో ఇదే గ్రామంలో 191.64 ఎకరాలు కేటాయించారు. ఈ భూములకు ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు వంతను అదాని గ్రీన్ ఎనర్జీ ప్రభుత్వానికి కౌలు చెల్లించాల్సి వుంది. తాజాగా ప్రస్తుతం కేటాయించిన 41.99 ఎకరాలను ఎకరా రూ.ఐదు లక్షల వంతున ధర నిర్ణయించింది. మొత్తం రూ.2,09,90,00లు మతింపుతో ఈ కేటాయింపులు జరుగనన్నాయి. దీనికి సంబంధించి అమల్లో ఇతర నిబంధనలను పాటించాలని సూచిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే బస్సుకు రూ.10 వేలు జరిమానా

మదనపల్లెఅర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా సంబంధించిన ఎస్ఎల్‌టీ సర్వీసు బస్సుకు ఆర్టీవో ప్రతాప్ శుక్రవారం రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రతాప్ మాట్లాడుతూ మదనపల్లె నుంచి బెంగళూరుకు ప్రతి రోజు ఉదయం మదనపల్లె బెంగళూరు బస్టాండ్‌లో 8.45కు బయలుదేరుతోంది. కానీ శుక్రవారం 7.45కు బయలుదేరింది. దీంతో మరొక బస్సు కన్నా ఒక గంట ముందుగా బయలుదేరడంతో వివాదం జరిగిందన్నారు. సమాచారం తెలుసుకున్న ఆర్టీవో ప్రతాప్ తమ సహచరులు ఎంవీఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్యలతో కలిసి బెంగళూరు రోడ్డులో బస్సు ఆపి సమయం, తదితర వివరాలను చెక్ చేశారు. పర్మిట్ కన్నా గంట సమయం ముందు వెళుతుండడంతో ఆ బస్సుకు పది వేలు జరిమానా విధించారు.

మదరసా నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదు

మదనపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినికొండ పంచాయతీ-1 జన్మభూమికాలనీలో మదరసా నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జన్మభూమి కాలనీలోని బసినికొండకు దిగువవైపున 2000 సంవత్సరంలో ఉర్దూస్కూల్ మంజూరైంది. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ అక్కడ పాఠశాల నడుస్తోంది. ఇక్కడి పాఠశాలలో బసినికొండ, రింగురోడ్డు, జన్మభూమి కాలనీ, నక్కలకుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల ఆవరణలో అదనపు గదులు కూడా నిర్మించారు. తాజాగా స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో మదరసా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భూమి చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు మదరసా ఏర్పాటును వ్యతిరేకిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ అంగన్‌వాడీ భవనం నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నా..ఆలస్యం అవుతోందని, అయితే ప్రభుత్వం ఎప్పుడో నిషేధించిన మదరసాను ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు ఆపేయాలని కోరుతూ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు.



ఉర్దూస్కూల్ ఆవరణలో మదరసా ఏర్పాటుకు చదును చేసిన స్థలం

చౌకధర దుకాణాలకు సకాలంలో సరుకులు అందించాలి

- జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం



పౌరసరఫరాల గోదామును తనిఖీ చేస్తున్న డీఎస్‌వో రఘురాం

లక్కిరెడ్డిపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): చౌకధర దుకాణాలకు సకాలంలో సరుకులు అందించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పౌరసఫరాల గోదామును రఘురాం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాలకు సకాలంలో నాణ్యమైన సరుకులను పంపిణీ చేయాలని గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబును ఆదేశించారు. గోదాములో నిలువ చేసిన నిత్యవసర వస్తువుల తయారీ తేదీ, సరుకుల ముగింపు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గోదాము దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబు, డీటీ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రామాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లెలో ఇంటి స్థల విషయం గురించి తనకు న్యాయం జరగలేదని అవమానంతో పురుగుల మందు తాగి నందలూరు బసిరెడ్డి (70) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి వివరాల మేరకు... నందలూరు బసిరెడ్డి ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన దేరంగుల వెంకటమణ అనే వ్యక్తి బసిరెడ్డి ఇంటి ముందు చిల్లర అంగడి పెట్టుకుంటానని విన్నవించాడు. కొంత కాలానికి బసిరెడ్డికి, వెంకట్రమణకు మధ్య విబేధాలు తలెత్తడంతో అంగడిని ఖాళీ చేయమని బసిరె డ్డి వెంకట్రమణకు తెలిపారు. అయితే వారు ఎంత చెప్పినా ఖాళీ చేయకపోవడంతో బసిరెడ్డి పురుగుల మందు తాగినట్లు ఆయన కుమారుడు రామాంజనేయులురెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

రాజంపేటటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ శివారులో ఆటో - బైకు ఢీకొన్న సంఘటనలో వెంకటరమణకు తీవ్రగాయాలయ్యాయి. ఓబులవారిపల్లె మండలం నూకనపల్లెకు చెందిన వెంకటరమణ రాజంపేటకు వస్తుండగా ఆటో వేగంగా వచ్చి బైకును ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటరమణ కాలికి తీవ్ర గాయాలు కాగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గృహ నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి

రైల్వేకోడూరు రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ అనుమతుల ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కుడా ఏపీఓ-2 క్రిష్ణసింగ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎల్‌టీపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఉపచైర్మన్ ఆదితిసింగ్ ఆదేశాల మేరకు మండలంలోని రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణ అనుమతులను తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేసుకుని పనులు ప్రారంభించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జీఓలపై అధికారులకు అవగాహన కల్పించారు. అనుమతులు ఉంటేనే నూతనంగా లేవుట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. 300 చదరపు మీటర్లు ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యదర్శి ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. కమర్షియన్ నిర్మాణం కోసం తప్పనిసరిగా కుడా అనుమతులు ఉండాలన్నారు. కేవలం ఒక రూపాయితో 50 చదరపు మీటర్లలో ఇంటి నిర్మాణం చేసుకోవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో జేపీవో ఇందు, ఎంపీడీవో నాగార్జున రావు, ప్లానింగ్ కార్యదర్శి ఎస్.మణయ్య, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుడా ఏపీవో క్రిష్ణసింగ్

ఉత్కంఠ నడుమ సర్పంచ్ ఓట్ల రీ కౌంటింగ్

- అడ్వకేట్ కమిషనర్ సమక్షంలో నిర్వహణ

వాల్మీకిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీకి సంబంధించి 2021లో జరిగిన ఎన్నికల నాటి ఓట్లకు రీకౌంటింగ్ ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఎన్నికల కౌంటింగ్‌లో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ సర్పంచ్ అభ్యర్థి శ్రీనాథరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ అనంతరం శుక్రవారం వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయంలో అడ్వకేట్ కమిషనర్ ఆనందకుమార్ సమక్షంలో రీ కౌంటింగ్ నిర్వహించారు. వివరాలను హైకోర్టుకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్ఐలు, 40 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో మస్తాన్, డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో మనోహర్‌రాజు, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవో రవీంద్రనాథ్, ఏపీవో సునీల్, న్యాయవాదులు, తదితర అధికారులు పాల్గొన్నారు.



2021 నాటి ఓట్లను రీ కౌంటింగ్ చేస్తున్న అధికారులు

మంగంపేట కంకర క్వారీ పరిశీలన

ఓబులవారిపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపేట పరిధిలో ఉన్న కంకర క్వారీని శుక్రవారం జిల్లా మైన్స్ ఏడీ సుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందపల్లె గ్రామస్థులు మాట్లాడుతూ కాలుష్యం కారణంగా పంటలు నష్టపోతున్నామని, దుమ్ము ధూళితో శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని ఏడీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈశ్వర్ రాజు, శివప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో గొడవపడి ఓ మహిళ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం, పాలసముద్రం, బోయపల్లెకు చెందిన డ్రైవర్ అశోక్(29)తో కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన మాలరాణి(29) మూడేళ్లుగా సహజీవనం చేస్తోంది. కొంతకాలంగా వారు బెంగుళూరులో ఉంటున్నారు. ఈ మధ్యనే అతను తమ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. కాగా శుక్రవారం ఇద్దరూ మదనపల్లెలో కలుసుకున్నారు. ఆ సమయంలో అశోక్ కాలికి గాయం కావడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో అశోక్ ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆగ్రహించిన ఆమె ఆస్పత్రి నుంచి వెళ్లి బంకులో పెట్రోల్ కొనుక్కుని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కోమటివాని చెరువు కట్టకింద రోడ్డులో శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుంది. ఆమెను వెతుకుతూ అక్కడికి చేరుకున్న అశోక్ మంటలు ఆర్పే ప్రయత్నంలో గాయపడ్డాడు.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆమెను ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో 274 మలేరియా కేసులు

- డీఎంవో రామచంద్రారెడ్డి



బాధితులకు కిట్‌లు అందజేస్తున్న డీఎంవో రామచంద్రారెడ్డి

పుల్లంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 274 మలేరియా కేసులు ఉన్నాయని లక్కిరెడ్డిపల్లెలో 3 కేసులు ఉంటే రాజంపేట డివిజన్‌లో 271 కేసులు జిల్లా మలేరియా అధికారి టి.రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పుల్లంపేటలో ఇరువురు మలేరియా బాధితులకు ఎంఎండీపీ కిట్‌లను పంపిణీ చేసి వాడే విధానాన్ని అవగాహన కల్పించారు. అనంతరం పుల్లంపేటలోని వీధుల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లాలో 266 రెసిడెన్షియల్ వసతి గృహాలు ఉన్నాయని, దోమల నివారణకు యాంటి లార్వా స్ప్రే చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ చంద్ర, సీహెచ్‌వో రాజు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి కృష్ణమ్మ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుండంలో పడి అఘోరి మృతి

చిట్వేలి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నగిరిపాడు పంచాయతి పెద్దూరు అటవీ ప్రాంతంలోని గుండాలకోన గుండంలో పడి అఘోరి మృతిచెందింది. గత శివరాత్రి సందర్భంగా ఆమె గుండాలకోనను సందర్శించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అఘోరి గురువారం గుండాలకోనకు వచ్చి నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లిందని శుక్రవారం గుండంలో శవమై తేలిందని, ఈ విషయం స్థానిక పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అఘోరికి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో శవాన్ని రైల్వేకోడూరు మార్చురిలో ఉంచినట్లు పోలీసులు తెలియజేశారు. అఘోరికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే సీఐ నెం.9121100576, ఎస్ఐ నెం.9121100579కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లెటౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. బి.కొత్తకోట మండలం సుబ్బిరెడ్డిగారిపల్లెలో జి.రవి నుంచి నాలుగు లీటర్లు, టి.ఆనంద్ నుంచి నాలుగు లీటర్లు, కె.వెంకటరమణ నుంచి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. గ్రామంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి 370 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, హెచ్‌సీలు మధుసూదన్, పీసీలు వెంకటేశ్, నాగరాజు, మధు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లతో నీటిని నిల్వ చేసుకోవచ్చు



ఫారంపాండ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

వల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఫారంపాండ్ ఏర్పాటు చేసుకుంటే నీటి నిల్వ ఉంటుందని.. పంటల సాగుకు రైతులు సద్వినియోగం చేసుకోవచ్చని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గోటూరు గ్రామంలో శుక్రవారం ఫారంపాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మాట్లాడుతూ ఫారంపాండ్ ఉపాధి సిబ్బంది తెలిపిన కొలతల ప్రకారం ఈ ఫారంపాండ్‌ను రైతులు తవ్వుకోవాలని సూచించారు. ఇందుకయ్యే ఖర్చులు కూడా ఉపాధి ద్వారానే అందిస్తామని తెలిపారు. అనంతరం ఉపాధి పనులు చేస్తున్న కొంతమంది ఉపాధి కూలీలతో ఆయ న మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి ఉదయాన్నే ఉపాధి పని వద్దకు రావాలని సూచించారు. అనంతరం వారికి తగిన సలహాలు సూచనలు అందించారు. మండలంలో ఈ నెలాఖరుకల్లా 82 ఫారంపాండ్‌లు పూర్తి చేయాలని ఆదేశించారు. వీరివెంట ఏపీవో సుధారాణి, ఈసీ అంజలి, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా ఎద్దులకు మొదటి బహుమతి



బండలాగుతున్న ఎద్దులు

చాపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాలజిల్లా మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన కట్టుబడి రోలి మేడమ్ ఎద్దులు మొదటి బహుమతి రూ.70వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి రెండవ బహుమతి రూ.50వేలు, కడప పట్టణం రూకవారిపల్లె గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి ఎద్దులు మూడవ బహుమతి రూ.40వేలు గెలచుకున్నట్లు తెలిపారు. కేసీకెనాల్ కమిటీ వైస్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, గ్రామస్థులు విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, గ్రామంలో రెండు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

చిన్నారి ఘటనను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం అయ్యవారి కంబాలదిన్నె గ్రామంలో శుక్రవారం మూడేళ్ల చిన్నారిపై జరిగిన దారుణ ఘటన క్షమించరానిదని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. ఈ ఘటన సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి కుటుంబానికి న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50వేలు సాయం అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాకీ విషయంపై గొడవ...
యువకుడిపై మచ్చుకత్తితో దాడి



గాయపడిన శివరామకృష్ణారెడ్డి

కలసపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువరామాపురంలో బాకీ విషయంపై జరిగిన గొడవలో శివరామకృష్ణారెడ్డి (24) అనే యువ కుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన అంకిరెడ్డి అనే వ్యక్తికి శివరామకృష్ణారెడ్డికి మధ్య డబ్బుల విషయమై కొద్ది రోజుల నుంచి వివాదం జరుగుతోంది. గురువారం రాత్రి శివరామకృష్ణారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి అక్క డ ఉన్న తల్లి నారాయణమ్మ, ఇతర కుటుంబ సభ్యులను అంకిరెడ్డి దూషించి వెళ్లాడు. దీంతో ఆగ్రహానికి గురైన శివరామకృష్ణారెడ్డి తన తల్లితో కలిసి అంకిరెడ్డి ఇంటి వద్దకెళ్లి గొడవపడ్డారు. ఒక్కసారిగా మచ్చుకత్తితో శివరామకృష్ణారెడ్డిపై అంకిరెడ్డి దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావడంతో శివరామకృష్ణారెడ్డిని కడప రిమ్స్‌కు.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. విషయం తెలుసుకున్న కలసపాడు పోలీ సులు బాధతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి



రాహుల్ మృతదేహం

చెన్నూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆమంచి రాహుల్ (18) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరుకు చెందిన రాహుల్ తన స్నేహి తుడు రాజేశ్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతుండగా శేషయ్యగారిపల్లె సమీపంలో ముందు వెళుతున్న మినీ లారీని అదుపు తప్పి ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలి సిందే. వీరిని కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాహుల్ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రైతు బజార్‌లను సద్వినియోగం చేసుకోవాలి

● వేంపల్లె రైతు బజార్‌పై కలెక్టర్‌తో చర్చిస్తా..సీఈఓ
● ఆంధ్రజ్యోతి కథనంపై సాగిన చర్చ



వేంపల్లెలో రైతు బజార్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ మాధవీలత

వేంపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 125 రైతు బజార్‌లు ఉన్నాయని... రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకువచ్చి రైతు బజార్‌లలో విక్రయించుకోవచ్చని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) మాధవీలత పేర్కొన్నారు. వేంపల్లెలో నూతనంగా నిర్మించి నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. రైతు బజార్‌ల ఎస్టేట్ అధికారిణి రుచిత, ఇతర అధికారులతో మాట్లాడారు. వేంపల్లెలో రైతు బజార్ నిరుపయోగంగా ఉండటానికి గల కారణాలపై సీఈవో ఆరాతీశారు. ఈసందర్భంగా శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'రూ.1.20 కోట్ల ప్రజాధనం వృథా' కథనంపై చర్చించారు. రైతుబజార్‌ను వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చొరవ చూపాలనే విషయంపై సీఈఓ మాట్లాడుతూ రైతుబజార్‌ను తెరిపించేందుకు కలెక్టర్, డీపీఓతో చర్చిస్తామన్నారు. త్వరలోనే ఉపయోగంలోకి తెచ్చేలా చూస్తామన్నారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ రైతులకు మేలు జరగాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం రైతు బజార్‌లను ఏర్పాటు చేస్తోందని, తమ ఉత్పత్తులను తెచ్చుకొని ఉచితంగా స్టాల్స్‌లో అమ్ముకోవచ్చన్నారు. ఈ సందర్భంగా బీజే పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ సీఈఓ మాధ వీలతకు వినతిపత్రం సమర్పించారు. ఏడాదిగా మూతపడి ఉన్న రైతుబజార్‌ను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రూ.62 కోట్లతో బ్రిడ్జి పనులకు తిరిగి శంకుస్థాపన



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లె గ్రామం వద్ద రూ.62 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తిరిగి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు తాను గండికోట ముంపు సమస్యలపై పాదయాత్ర చేశానని టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రిడ్జి పనులు చేపడతామని హామీ ఇచ్చానన్నారు. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే బ్రిడ్జి పనులను తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గండికోట బ్యాక్‌వాటర్ పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు సంకేపల్లె చుట్టూ ఎనిమిది గ్రామాల ప్రజలు 50 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందన్నారు. ప్రజల ఇబ్బందిని గమనించి 2019వ సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వంలో అప్పుడు మంత్రిగా ఉన్న తన బాబాయి ఆదినారాయణరెడ్డి చొరవతో రూ.34కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభించారన్నారు. బ్రిడ్జి పనుల్లో పిల్లర్లు వేసిన తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు జరగకుండా ఎంపీ, అప్పటి ఎమ్మెల్యే అడ్డుకున్నారన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో తాను, తన బాబాయి పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.62 కోట్లతో తిరిగి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు రామాంజులరెడ్డి, ఎంపీటీసీ రామమునిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నరసింహారెడ్డి, బాబురెడ్డి, గోరుశెట్టిబాబు, రాఘవేంద్రారెడ్డి, రమణారెడ్డి, మాధవరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కారులో అన్నింటా జిల్లాకు అన్యాయం

● మహానాడులో న్యాయం జరిగేలా తీర్మానం చేయాలి ● పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి) కూటమి సర్కారు ఏర్పడిన 11 నెలల పాలనలో జిల్లాకు అన్నింటా అన్యాయం జరిగిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో జిల్లాలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉండేవారని, చంద్రబాబు పాలనలో జిల్లా నుంచి కనీసం ఒక్కరికీ కూడా మంత్రి పదవి ఇవ్వకుండా జిల్లా అభివృద్ధికి అడ్డు పడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మూడు దఫాలుగా కొండవీటి చాంతాండంత నామినేటెడ్ పదవులు ప్రకటించారని, జిల్లాకు చెందిన ఒక్కరికి కూడా పదవి దక్కలేదన్నారు. అంతేకాకుండా టీటీడీ బోర్డులో కూడా జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. కడపలో జరగనున్న మహనాడు లోనైనా కొన్నింటికైనా పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇక పోతే గత ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ జీవో 85 జారీ చేసిందన్నారు. ఆ జీవోను కూటమి సర్కారు రద్దు చేయకపోగా పకడ్బందీగా అమలు చేస్తోందని విమర్శించారు. ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలిగేలా మహానాడులో నైనా జీవో 85ను రద్దు చేయాలన్నారు. విభజన చట్టం హామీల అమలులో భాగంగా జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, బుం దేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లను నెరవేర్చాల న్నారు. ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కడప- రాయచోటి, మదనపల్లి, బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం పనులు ఆగాయన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారి పనులు మొదలు చేయడంలో కూటమి సర్కారు విఫలమయ్యిందని ఎద్దేవా చేశారు. తెలుగుగంగ, గాలేరు నగరి, వెలిగొండ ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగ ళి అక్కడే అన్నట్లుగా ఉందని విమర్శించారు. జిల్లా అభివృద్ధికి ఏమి చేయ దలచారో మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు అఫ్జల్‌ఖాన్, ఆశోక్ కుమార్‌రెడ్డి, సిరాజుద్దీన్, భువన్‌రెడ్డి, రఫీక్‌ఖాన్, సంఘ సేవకులు సలా ఉద్దీన్, మామిళ్ల బాబు, ఎస్‌ఏ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో అదుపు తప్పిన బస్సు..



గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద అదుపు తప్పిన బస్సు

సీకేదిన్నె, మే 23 (ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు ఘాట్‌లో ఓ ప్రైవేటుట్రావెల్స్‌కు చెందిన బస్సు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. రాయచోటివైపు నుంచి కడపకు వస్తున్న బస్సు గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద గురువారం రాత్రి అదుపు తప్పి మట్టికుప్పపైకి ఎక్కి ఆగిపోయింది. దీంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. కాగా, బస్సు తిరుపతిలో అపహరణకు గురైనట్లు, చోరీకి గురైన బస్సు గురువారం రాత్రి గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద ప్రమాదానికి గురై ఆగిపోవడంతో నిందితుడు బస్సు అద్దాలు పగులకొట్టుకుని పారిపోయినట్లు తెలిసింది. ఘటనపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బండ్లకు ఇక చెల్లు

● డీలర్ల వద్దనే రేషన్ పంపిణీ
● వచ్చే నెల నుంచి అమలుకు చర్యలు



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పులివెందుల టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర వస్తువులు పంపిణీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఎండీయూ వాహనాలు అందుబాటులో తెచ్చింది. కార్డుదారులకు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో 2020 ఫిబ్రవరిలో ఈ వాహనాలు ఏర్పాటు చేశారు. అయితే ఆచరణలో మాత్రం పలుచోట్ల వీధుల్లో కూడా సరుకులు పంపిణీ చేయలేకపోయింది. ఎండీయూ ఆపరేటర్లుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలే ఉండడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా ప్రజా పంపిణీ వ్యవస్థ తయారైంది. డీలర్లకు పని లేకుండా చేయడంతో పాటు నిత్యం సర్వర్ సమస్యతో కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందేవి కావు. దీనిపై పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత రెండురోజుల క్రితం పౌర సరఫరాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టత కూడా ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న వాహనాలను కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు అప్పగించాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జూన్ నుంచి రేషన్ డిపోల నుంచే సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. దీంతో జిల్లాలో ఉన్న 366 వాహనా లకు ఇక కాలం చెల్లింది.

జూన్ 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1239 చౌకదుకాణాల ద్వారా 5,78,685 లక్షల మందికి కార్డుదారులకు సరుకులు అందించేలా ప్రణాళిక రూపొందిస్తుంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నెలంతా రేషన్ దుకాణాలు పనిచేసేలా చర్యలు చేపట్టడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే సరుకులు అందించేలా చర్యలు చేపడుతుంది. ఇప్ప టికే డిపోలు ఎక్కడున్నాయో చాలా మంది కార్డుదారులు తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి సూచించారు. దీంతో చౌకదుకాణాలను డీలర్లు శుభ్రం చేసే పనిలో పడ్డారు. స్థానిక ప్రజలను పిలిచి డిపోలను ప్రారంభించనున్నారు. దీంతో పాత విధానం అమలులోకి రానుంది. నేరుగా కార్డుదారులు డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంది. కానీ పట్టణ ప్రాంతంలో మాత్రం డిపోలు ఎక్కడున్నాయో తెలుసుకోవడం కష్టం. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. అవినీతి అక్రమాలకు తావు లేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై ఆఫీసరు పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు.

కూటమి పాలనలోనే
ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ నాగరాజు

కడప మారుతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించడం జరిగిందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సముదాయ భవనంలోని ఆయన ఛాంబరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామనే సాకుతో దాదాపు 48వేల కుటుంబాల చిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. చిన్న చిన్న కారణాలను సాకు గా చూపి ఉద్యోగులను (కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, ఇతర చిరుద్యోగులు) పనిష్‌మెంట్లు, సస్పెండ్లు, రిమూవ్ చేస్తూ వారిని తీవ్ర మనోవేదనకు గురయ్యేలా చేశారన్నారు. చాలామంది ఉద్యో గులు ఈ విషయం తన దృష్టికి తీసుకురావడంతో ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరామన్నారు. ఆ మేరకు వారు స్పందించి 2019 నాటి జీవోను తిరిగి ఈనెల 22న రాత్రి నుంచి అమల్లోకి తీసుకువచ్చారన్నారు. కాగా, చిత్తూరు, మంత్రాలయం రూట్లలో కేఎస్ఆర్‌టీసీలో ఏపీ సీనియర్ సిటి జన్లకు రాయితీ సౌకర్యం కల్పించాలని ఇటీవల కర్ణాటక రాష్ట్ర రవాణ శాఖ మంత్రిని కోరామన్నారు. సమావేశంలో ఆర్టీసీ కార్మిక పరిషత్ జోనల్ నాయకులు పురుషోత్తం పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో
బాలవికాస్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న బాలవికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్య

కడప ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్ష ఫలితాల్లో కడప నగరం ఎర్రముక్కపల్లె బాలవికాస్ విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఆ సంస్థ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, కోఆర్డినేటర్ ధరణికుమార్, డైరెక్టర్ గంగయ్య తెలిపారు. మొత్తం 300 మార్కులకు గాను 250కి పైగా 8 మంది విద్యార్థులు సాధించారన్నారు. 200 మార్కులుకు పైగా 41 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

పిచ్చికుక్క దాడి.. స్వీపరుకు గాయాలు

పులివెందుల టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండులో పిచ్చి కుక్క దాడిలో ప్రశాంతి అనే స్వీపర్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం ఆర్టీసీ ఆవరణలో శుభ్రం చేస్తుండగా పిచ్చి కుక్క వెంబడించి దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈవిషయం ఆర్టీసీ అధికారులు మున్సిపల్ కమిషనరు రాముడు దృష్టికి తీసుకెళ్లడంతో పిచ్చికుక్కల నియంత్రణకు చర్యలు చేపడతామని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు

● రైల్వేకోడూరు మండలంలో జూన్ 1 నుంచి ఆంక్షలు

రైల్వేకోడూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానా తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. రైల్వేకోడూరు మండలంలో జూన్ 1 నుంచి కఠిన ఆంక్షలు విధించనున్నారు. కాగా ప్లాస్టిక్ మన నిత్య జీవితంలో భాగమైంది. ఇంట్లో ఏ మూల చూసినా ఏదో ఒక రూపంలో ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటాయి. చిన్న దుకాణం నుంచి షాపింగ్ మాల్ వరకు ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వం 40 మైక్రాన్స్ కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను నిషేధించినప్పటికి ఇది అమలులో పూర్తిగా విఫలమైంది. గతంలో పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ కవర్లు అమ్మేవారిపై దాడులు నిర్వహించి, జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొంతమేరకు తగ్గినప్పటికీ ప్రస్తుతం పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. పశువులు ఈ ప్లాస్టిక్ కవర్లు తిని అనారోగ్యానికి గురువుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన అధికారులు మళ్లీ ప్లాస్టిక్ కవర్లపై కఠిన ఆంక్షలు విధించనున్నారు. జూన్ 1వ తేదీ నుంచి 40 మైక్రాన్స్ కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయించడంపై పూర్తి నిషేధం విధించనున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.



చెత్త కుప్పలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

ప్లాస్టిక్ విక్రయిసే కఠిన చర్యలు తప్పవు



జూన్ 1వ తేదీ నుంచి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. బట్ట సంచులు, కాగితం సంచులు, జూట్ సంచులు వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహిస్తున్నాం. ఈ చర్యల ద్వారా కోడూరు పట్టణాన్ని ప్లాస్టిక్ కాలుష్యం నుంచి కాపాడాలన్నదే మా సంకల్పం. ప్రజలు కూడా ఈ విషయంలో సహకరించాలి.

- ప్రసాద్ రావు, పంచాయతీ కార్యదర్శి

పక్కా గృహాలు త్వరగా పూర్తి చేయండి

సిద్దవటం, మే 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జ్యోతి, ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, మూలపల్లె గ్రామాల్లో పక్కా గృహాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ నిర్మాణ పనులు జూన్ 10 లోపు పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణదారులకు అదనంగా ఒక్కొక్కరికి రూ.50 వేలు మంజూరవుతాయన్నారు. ఏఈ చెన్నయ్య, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మారెమ్మ తిరునాళ్లు

సుండుపల్లె, మే23(ఆంధ్రజ్యోతి):మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికి సమీపంలో కుడికాలువ గట్టుపై వెలిసిన అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు మారెమ్మ తల్లి, కాళికాదేవి తిరునాళ్లు వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం సేవాలాల్ మహరాజ్‌కు పూజలు చేసినట్లు తెలిపారు.

తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన తిరుమలబాబు



సిద్దవటం, మే 23 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం తహసీల్దారుగా తిరుమలబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సిద్దవటం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్సాహంగా సాగుతున్న యోగాంధ్ర

చిట్వేలి, మే 23 (ఆంధ్రజ్యోతి): చిట్వేలి మండలంలో యోగాంధ్ర కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. శుక్రవారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో ఎంపీడీవో మోహన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. వివిధ రకాల యోగాసనాలను చేయించారు. ఈ సందర్భంగా యోగా ట్రైనర్ పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ యోగాసనాలు ద్వారా ఏకాగ్రతను పెంచి అలసట, ఆందోళన, ఒత్తిడులు తగ్గి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఐసీడీఎస్ సీడీపీవో నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్‌లు సురేఖరాణి, వసుంధరమ్మ, విశాలాక్షి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎస్ టెస్టింగ్ స్టేషన్ ప్రారంభం



ఏటీఎస్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్, మే23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం రాయచోటి పట్టణ పరిధిలోని వరిగ రోడ్డులో ఏర్పాటు చేసిన ఏటీఎస్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఆటోమేటెడ్ టెస్టింగ్‌స్టేషన్ ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు.

మహానాడును జయప్రదం చేద్దాం

రామాపురం, మే23(ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గువ్వలచెరువులో మహానాడుకు చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచి వెళ్లే నాయకులు, కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనాల పార్కింగ్, భోజనశాల స్థలాన్ని పరిశీలించి పనులు ప్రారంభించారు. వాహనాలకు 30 ఎకరాల్లో విశాలమైన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆజాంబాషా, అంజనేయులురెడ్డి, పట్టాభిరెడ్డి, మదన్, హరి, బండారు తిమ్మారెడ్డి, డాక్టర్ శ్రీను, దేరంగుల శ్రీను, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే23(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వినతులు స్వీకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దీర్ఘకాలిక సమస్యలను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

ఓబులవారిపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ప్రయోజనకరమని ఏవో మల్లిక పేర్కొన్నారు. శుక్రవారం బాలిరెడ్డిపల్లె పంచాయతీలోని బాలాజీనగర్‌లో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఏపీఎం రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి బిందు హాజరై ప్రకృతి వ్యవసాయంపై సూచనలు ఇచ్చారు. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రామయ్య, ఎంసీఏ బుల్లయ్య రైతులతో మాట్లాడారు. రైతులు రమణారెడ్డి, బాబుల్‌రెడ్డి, మోడల్ మేకర్ తిరుపాలమ్మ, వీవోఏ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

రాజంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని సీఎస్ఆర్ పాలిక్లీనిక్ నందు చిన్నపిల్లలకు ఆర్థో, ప్లాస్టిక్ సర్జరికి సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సీఎస్ఆర్ పాలీ క్లీనిక్ నిర్వాహకులు పి.హరికృష్ణంరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్‌లు దుర్గాప్రసాద్, సురేఖ ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తారన్నారు. పుట్టుకతో వచ్చిన వంకర్లు, మోకాలి ఒంపులు, జన్మతరహా వచ్చిన వంకర్లకు వైద్యం అందిస్తారని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కొత్త మాధవరం చౌకదుకాణం సీజ్



చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీటీ సౌజన్య

ఒంటిమిట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమాధవరం చౌకదుకాణాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దారు రమణమ్మ తెలిపారు. శుక్రవారం సివిల్‌సప్లై డీటీ సౌజన్య ఆధ్వర్యంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో బియ్యం, జొన్నలు తక్కువ ఉన్నట్లు బయట పడిందన్నారు. 1550 కిలోల బియ్యం, 519 కిలోల జొన్నలు తక్కువ ఉన్నాయి. దీంతో కొత్త మాధవరంలో నాగమురళికి చెందిన చౌకదుకాణాన్ని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

29న మాతంగ మహాపీఠం శిలాశాసన ప్రతిష్ఠ

లక్కిరెడ్డిపల్లె, మే23(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలో వెలిసిన మాతంగ మహాపీఠం నిర్మాణానికి శిలాశాసన ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆ పీఠాధిపతి మాతంగ గిరి మహాస్వామి తెలిపారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలోని మాతంగ మహాపీఠ శిలాశాసన ప్రతిష్ఠ గోడపత్రాలను ఆవిష్కరించారు. పీఠాదిపతి ధర్మాధికారి పీవీ డాక్టర్ సుబ్బారెడ్డి, హరిహర పురి గురు సేవా సమితి కన్వీనర్ అరమాటి శివగంగిరెడ్డి, పీఠం కమిటీ సభ్యులు వెంకట్రామరాజు, కృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం

రాయచోటిటౌన్, మే23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం శుక్రవారం గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని గొర్లముదివేడు గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతులకు, మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మండల ఇన్‌చార్జి వంశీ, యూనిట్ ఇన్‌చార్జులు హరిబాబు, రమణమ్మ, ఐసీఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

రామాపురం, మే23(ఆంధ్రజ్యోతి): జీవితాలను ఉన్నతంగా మలుచుకోవడానికి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని రామాపురం ఐసీడీఎస్ క్లస్టర్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. హసనాపురం పంచాయతీ కుమ్మరపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం 'విద్యా కెరీర్ మార్గదర్శకం, నైపుణ్యం' అనే అంశంపై కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యలో రాణించాలన్నారు.

ముగిసిన ఆంజనేయస్వామి తిరునాళ్లు

సుండుపల్లె, మే23(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పంచాయతీ గుట్టకాడబలిజపల్లె, రాయవరంలలో నిర్వహించిన ఆంజనేయస్వామి తిరునాళ్లు ఘనంగా ముగిశాయి. శుక్రవారం తెల్లవారుజామున రాయవరం, గుట్టకాడబలిజపల్లె దేవరగుట్టపై వెలిసిన ఆంజనేయస్వామి ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణలు, బాణసంచా పేలుళ్లు, చెక్క భజనలు, కోలాటాల మధ్య చాందినీ బండ్లను ఆలయానికి తీసుకువచ్చారు.

పెండింగ్‌లో ఉన్న పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

లక్కిరెడ్డిపల్లె, మే23(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు ఈ ప్రభుత్వంలో అదనంగా రూ.50 వేలు ఇస్తున్నామన్నారు. పూర్తికాని గృహాలను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ సాంబశివయ్యను ఆదేశించారు.మండలంలో తాగునీటి సమస్య లేకుండా తక్షణమే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉషారాణి, ఎంఈవో చక్రేనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కిశోర్, అగ్రికల్చర్ ఏడీ జయరాణి, ఏవో రమేశ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మూడు చక్రాల మోటార్ వాహనం మంజూరు

లక్కిరెడ్డిపల్లెకు చెందిన కోనేటి లక్ష్మీదేవికి కలెక్టర్ మూడు చక్రాల వాహనాన్ని అందించారు. దీంతో కలెక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మడిగుంటపల్లెలో జ్వరాలు



ముమ్మడిగుంట గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న తనూష

సిద్దవటం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముమ్మడిగుంటపల్లె ఎస్సీ కాలనీలో ప్రజలను జ్వరాలు పీడిస్తున్నాయి. స్థానికులు రాజాబాబు, తనూష జ్వరాలతో మాధవరం, ఉప్పరపల్లె ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. మరికొంత మంది జలుబు, దగ్గు, కళ్లు మంటలు, నొప్పులతో అవస్థలు పడుతున్నారు. మురుగు పూర్తిగా తొలగించి బ్లీచింగ్ పిచికారీ చేయాలని గ్రామస్థులు కోరారు. జ్వరపీడితులకు డాక్టర్ శివకుమార్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

'గుంజననదికి రక్షణ గోడ నిర్మించాలని దీక్ష'



గుంజననదిలోనే దీక్ష చేస్తున్న డాక్టర్ సయ్యద్ అహ్మద్

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): గుంజననదికి రక్షణగోడ నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం గుంజననదిలోనే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా శాంతినగర్, నరసరాంపేట వద్ద రక్షణ గోడ నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు గుంజననది ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. దీంతో ప్రతి ఏటా శాంతినగర్, నరసరాంపేట ప్రాంతాలు కోతగురై ఇళ్లు దెబ్బతింటున్నాయన్నారు. కాగా రైల్వేకోడూరుకు శనివారం పార్టీ సీనియర్ నేత తులసిరెడ్డి వచ్చి దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రకృతి సేద్యంతో భూమికి జీవం

పెనగలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం భూమికి జీవం లాంటిదని పెనగలూరు వ్యవసాయాధికారి సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం పొందలూరు గ్రామ పంచాయతి పరిధిలోని కేసీ సముంద్రం గ్రామంలో గ్రామస్థాయి ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ పంటల తయారు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది సహకారంతో రైతులు ప్రకృతి వ్యవసాయ సాగును చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు కోసం రైతులతో ప్రణాళిక తయారు చేయాలని కోరారు. పీఎండీఎస్ పద్ధతిలో 20 నుంచి 30 రకాల విత్తనాలను వెదజల్లడం వల్ల అవి పెరిగి పశువుల మేతగాను, నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందకుండా ఎన్‌డీఎస్ కిట్ కావాల్సిన రైతులు750 చెల్లించి పొందవచ్చునన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ అంజనమ్మ పాల్గొన్నారు.

జనసేన పార్టీని బలోపేతం చేయండి



పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న జనసేన నేత శ్రీనివాసరాజు

రాజంపేట టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జనసేనపార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జనసేన నేతలు పార్టీని ప్రగతిపథంలో నడిపించాలన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. జనసేన నేతలు, వీర మహిళలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం : ఎమ్మెల్యే



సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేశామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. శుక్రవారం రైల్వేకోడూరు పట్టణంలోని ఒంటెల సిద్ధయ్యనగర్ వద్ద రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 నెలల్లో నియోజ కవర్గంలో సుమారు రూ.70 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. చాలా వరకు పనులు పూర్తి చేశామన్నారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళతామన్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, నాయకులు జోగినేని మణి, ముత్యాల కిషోర్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, అమర్ పాల్గొన్నారు.

అన్నమయ్య కాలిబాట వద్ద 50 సెంట్ల స్థలాన్ని ఏర్పాటు చేయండి

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కాలిబాట వద్ద 50 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని ఆర్‌ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్, బీజేపీ ప్రతినిధులు శుక్రవారం రెవెన్యూ శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాష్ నారాయణవర్మ మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని కుక్కలదొడ్డి సమీపంలో ఉన్న అన్నమయ్య కాలిబాట వద్ద ప్రభుత్వ భూమిని ఇస్తే విశ్వహిందూపరిషత్, బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ ప్రతి నిధులు కలసికట్టుగా షెడ్లు నిర్మిస్తామన్నారు.
కాలినడకన వెళ్లే భక్తులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, వీరేంద్ర, వరికూటి నాగరాజు, అలుగంటి దశరథ రామయ్య, వాకచర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకును

సందర్శించిన రీజనల్ మేనేజర్



ఖాతాదారులతో మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ సుషాంత్‌కుమార్ స్వారో

చిట్వేలి, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ సుషాంత్‌కుమార్ స్వారో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బాంకును సందర్శించారు. అనంతరం నక్కలపల్లె వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా బ్యాంకు ఒక సంవత్సరం డిపాజిట్‌పై 7.60 శాతం వడ్డీ రేటును అందిస్తుందన్నారు. పంట రుణాల కింద గరిష్టంగా రూ.3 లక్షల వరకు అందిస్తున్నామన్నారు. పొందలూరు, చిట్వేలి శాఖల మేనేజర్‌లు అశోక్‌కుమార్, శ్రీనివాసులు, ఉపసర్పంచ్ చంద్రమోహన్‌నాయుడు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనగలూరు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా ఖరీఫ్ సాగు కోసం రూ.3 లక్షల వరకు పంటరుణం ఇస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ సుషాంత్‌కుమార్‌స్వారో తెలిపారు. శుక్రవారం ఈటమాపురం పంచాయతీ పరిధిలోని మూగవారిపల్లె రామాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంకు ఖాతాదారులు, ఉపాధ్యాయ కూలీలతో ఆయన సమావేశమయ్యారు.

'జగన్‌కు లిక్కర్‌స్కాం భయం పట్టుకుంది'



మాట్లాడుతున్న బీజేపీ నేత పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లిక్కర్‌స్కాం భయం పట్టుకుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం వ్యవహరించారన్నారు. ఆర్థిక నేరాలకు కేరాఫ్ అడ్రస్ జగన్‌రెడ్డి అండ్ కో అన్నారు. నాడు చేసిన ఆర్థిక నేరాలకు నేడు పరాకాష్ట వహించాల్సి వస్తుందని, ముందుగానే మీడియా ముందుకు వచ్చి తాను హరిశ్చంద్రుడని, తనకు ఏమీ సంబంధం లేదని తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మద్యపానం నిషేధిస్తామని చెప్పి మోసంచేసి అధిక రేట్లకు అమ్మి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీవీ రమణ, బీజేపీ రాష్ట్ర నాయకులు హిమగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అనంత రుచులు



ప్రస్తుతం పెద్ద భవనంలో కొనసాగుతున్న పరిశోధన కేంద్రం

- అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలు
- శాస్త్రవేత్తల పరిశోధనలతో నూతన వంగడాలు
- త్వరలో విడుదలకానున్న పలు రకాల మామిడి వంగడాలు
- 90 ఏళ్లుగా రైతు సేవలో పరిశోధన స్థానం

రైల్వేకోడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పరిశోధన స్థానంలో 51 రకాల మామిడి కాయలను పండిస్తున్నారు. ఇప్పటికే ఆరు రకాల కొత్త వంగడాలను విడుదల చేసి విజయవంతం చేశారు. త్వరలో పలు రకాల మామిడి కొత్త వంగడాలను విడుదల చేయనున్నారు. పరిశోధన స్థానం 90 ఏళ్లుగా రైతు సేవలో ఉంది.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో పండ్ల తోటలు అత్యధికంగా ఉన్నాయని బ్రిటీష్ దొరలు (మద్రాసు ప్రావిన్స్)లో గుర్తించి అనంతరాజుపేటలో 1935లో పరిశోధన స్థానం ఏర్పాటు చేశారు. పరిశోధన స్థానానికి మొట్టమొదటి సూపరింటెంట్‌గా కేసీ నాయక్ వ్యవహరించారు. 1960లో ఐకార్ ఆర్థిక సాయంతో అప్‌గ్రేడ్ అయింది. పరిశోధన స్థానం లక్ష్యం ఉష్ణ మండల పండ్ల తోటలు అభివృద్ధితో పాటు తెగుళ్లు, వ్యాధుల నియంత్రణ చేసి మెరుగుపచడంపై 1957-66 మధ్య పరిశోధనలు ప్రారంభించారు.

తొమ్మిది దశాబ్దాలుగా..

ఉష్ణమండల పండ్ల పంటలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలపై పరిశోధనలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని మార్గదర్శక సంస్థలో ఈ కేంద్రం ఒకటిగా ఉంది. పండ్ల పంటలకు సాంకేతికలను అభివృద్ధి చేయడం, అధిక దిగుబడితో హైబ్రీడ్లను విడుదల చేయడం మామిడి ఇతర పంటలలో మంచి నాణ్యత గల పండ్లను రూపొందించడం లాంటి అనేక ఘనతలను సాధించింది. 90 సంవత్సరాలకు పైగా ఈ కేంద్రం స్థానం పండ్ల తోటల అవసరాలను తీరుస్తూ ఫలవంతమైన పరిశోధనలు చేసింది. ఉద్యాన పంటలపై పనిచేయడానికి హార్టికల్చర్ కీటకశాస్త్ర విభాగం, తెగుళ్ల విభాగాలు ఈ కేంద్రంలో ఉన్నాయి. ఉద్యాన కళాశాల స్థాపించిన తర్వాత ఉద్యాన పరిశోధన కేంద్రం, ఉద్యాన కళాశాలలో 2010 డిసెంబరులో విలీనం అయింది.

నిరంతర పరిశోధనలు

2012 నుంచి కూరగాయలు, పూలు, వార్షిక పంటలైన బొప్పాయి, అరటిపై పరిశోధనే ప్రధాన ఆదేశంతో పనిచేయడం ప్రారంభించారు. ఉద్యాన పరిశోధన కేంద్రం ద్వారా నీలీషాన్, నీలుద్దీన్, నీల్‌గోవా, స్వర్ణజహంగీర్, ఏయూ రుమాణి, కేఎంహెచ్-1 మామిడి రకాలను విడుదల చేశారు. కోడూరు-గోవా జహంగీర్, ఖాదర్-జహంగీర్, పంచదారకలస-విల్లార్డ్, పదిరి-అలంపూర్‌బనేషాన్, మల్గుబా-జహంగీర్, అంబలది-అలంపూరిబేనీషాన్, సువర్ణరేఖ-పదిరి అనే రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. త్వరలో వీటిని విడుదల చేయడానికి శాస్త్రవేత్తలు పరిశోధలు ముమ్మరం చేస్తున్నారు. మామిడికాయల రంగు, రుచి, వాసన, నాణ్యతలను పరిశీలిస్తున్నారు. ఇంకా చాలా కొంగొత్త వంగడాలపై పరిశోధనలు నిరంతరాయంగా చేస్తున్నారు. పరిశోధన కేంద్రం ద్వారా పదేళ్లుగా పులుసు నిమ్మ, బాలాజీ నిమ్మ, పీకేఎం-1 మొక్కలను రైతులకు అందిస్తున్నారు. అలాగే టిష్యూకల్చర్ ద్వారా నాణ్యమైన అరటి. పచ్చ అరటి, గ్రాండ్-9 మొక్కలను రైతులకు అందిస్తున్నారు.

తెగుళ్లు ఉండవు

ఇక్కడ అందించే పండ్ల మొక్కలకు ఎటువంటి వ్యాధులు, తెగుళ్లు ఉండవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మొక్కలను తీసుకుని సాగుచేస్తున్న రైతులకు మంచి సూచనలు, సలహాలు తీసుకుని దిగుబడులు చేస్తున్నారు. అదే కాకుండా ఎప్పుడూ వినిపించని, చూడని మామిడి రకాలను ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన కళాశాల వారు ప్రదర్శన చేస్తున్నారు. పరిశోధనలు విస్తరించడం, శాస్త్రవేత్తలు, సిబ్బంది పెరగడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల వ్యయంతో పెద్ద భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ పరిశోధనలు చేస్తున్నారు. ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

ఏటా కాపునిచ్చే మామిడిని అందిస్తాం



ప్రతి ఏటా కాపునిచ్చే మామిడిని రైతులకు అందిస్తాం. కాయ నాణ్యత, రంగు, రుచి, వాసనతో పాటు మంచి దిగుబడి వచ్చే రకాలపై పరిశోధనలు చేస్తున్నాము. గతంలో కొన్ని రకాలను మాత్రమే విడుదల చేశారు. కొత్త వంగడాలను ఎంచుకుని ఇతర ప్రాంతాల నుంచి కొమ్మలను తీసుకుని వచ్చి వాటిని సంపర్కం చేసిన తర్వాత వాటి పై పరిశోధనలు చేస్తున్నాము. త్వరలో కొన్ని మామిడి రకాలను విడుదల చేస్తాం.

- ఎం.శివప్రసాద్, ఉద్యాన కళాశాల ప్రధాన మామిడి శాస్త్రవేత్త

పరిశోధనలు వేగవంతం చేస్తున్నాం



పరిశోధనలు వేగవంతం చేస్తున్నాము. కావాల్సినంత వనరులు ఉన్నాయి. మంచి నాణ్యత ప్రమాణాలు కల్గిన మొక్కలను రైతులకు అందిస్తున్నాము. ఉద్యాన పరిశోధన కేంద్రం మొత్తం 300 ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. దీనికి సాగు నీరు అందించడానికి తగిన సామర్థ్యం ఉంది. పరిశోధనలకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయి. రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు ఇస్తున్నాము.

- కేఎం యువరాజు, ప్రధానశాస్త్ర వేత్త, అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం

ఇవీ మామిడి రకాలు


నీలుద్దీన్



పాపారావు గోవ

పరిశోధన కేంద్రంలో కొత్తపల్లె కొబ్బరి, పానకాలు, చిన్నరసం, పెద్దరసం, చెరుకురసం, పంచదారకలస, బెంగుళూర, జహంగీర్, బేనీషాన్, హిమాంపసందు, పెద్దనీలం, వికారాబాద్, పాపారావుగోవా, విల్లార్డ్, కాలేపాడు, మనోరంజన్, దశేరి, కోడూరు గోవా, పెద్దఖాదర్, కేసర్, సఫేదా, నీలం, పండూరి మామిడి, చిన్నసువర్ణరేఖ, సువర్ణరేఖ, పులిహోరా, పునాస, అల్ఫాన్సో, హైదర్, ప్రొద్దుటూరు అవకాయ, మహమూద్ వికారాబాద్, అచార్‌పసండ్, యలమంద, అలీపసండ్, గద్దె మామిడి, అమ్రపాలి, అంబలవి-అలంపూర్ బనేషన్, మల్గొవ-జహంగీర్, మంజీరా, మల్లిక, పదిరి-అలంపూర్‌బనేషన్, పంచాదారకలస-విల్లార్డ్, రత్న, ప్రభాశంకర్, ఖాదర్-జహంగీర్, అలంపూర్-బనేషన్-మల్గొవ, సువర్ణరేఖ-పదిరి, కోడూరు గోవా- జహంగీర్ అనే మామిడి రకాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిపై పరిశోధనలు సాగుతున్నాయి. ఇక్కడ పండే మామిడి కాయలు రుచి, రంగు, వాసన, నాణ్యత కల్గి ఉంటాయి. పరిశోధనలు పూర్తి చేసిన తర్వాత వాటిని రైతులకు అందిస్తారు.


సువర్ణరేఖ


ఎ. యు. రుమాని కె. ఎం. హెచ్-1


హైదర్


వికారాబాద్

అదాని ఎనర్జీకి మరో 42 ఎకరాలు

కలికిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కొండాపురం మండలంలో అదాని గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో వేయి మెగావాట్‌ల సామర్థ్యంతో నెలకొల్పనున్న పంప్‌డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టుకు మరో 41.99 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొండాపురం మండలం కె.బొమ్మేపల్లె గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 309/2, 310లలో 41.99 ఎకరాలను అదనంగా కేటాయించారు. న్యూ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ మార్గదర్శకంలో ఇక్కడ అదాని గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. గతంలో ఇదే గ్రామంలో 191.64 ఎకరాలు కేటాయించారు. ఈ భూములకు ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు వంతను అదాని గ్రీన్ ఎనర్జీ ప్రభుత్వానికి కౌలు చెల్లించాల్సి వుంది. తాజాగా ప్రస్తుతం కేటాయించిన 41.99 ఎకరాలను ఎకరా రూ.ఐదు లక్షల వంతున ధర నిర్ణయించింది. మొత్తం రూ.2,09,90,00లు మతింపుతో ఈ కేటాయింపులు జరుగనన్నాయి. దీనికి సంబంధించి అమల్లో ఇతర నిబంధనలను పాటించాలని సూచిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే బస్సుకు రూ.10 వేలు జరిమానా

మదనపల్లెఅర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా సంబంధించిన ఎస్‌ఎల్‌టీ సర్వీసు బస్సుకు ఆర్టీవో ప్రతాప్ శుక్రవారం రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రతాప్ మాట్లాడుతూ మదనపల్లె నుంచి బెంగళూరుకు ప్రతి రోజు ఉదయం మదనపల్లె బెంగళూరు బస్టాండ్‌లో 8.45కు బయలుదేరుతోంది. కానీ శుక్రవారం 7.45కు బయలుదేరింది. దీంతో మరొక బస్సు కన్నా ఒక గంట ముందుగా బయలుదేరడంతో వివాదం జరిగిందన్నారు. సమాచారం తెలుసుకున్న ఆర్టీవో ప్రతాప్ తమ సహచరులు ఎంవీఐలు దినేష్‌చంద్ర, శివలింగయ్యలతో కలిసి బెంగళూరు రోడ్డులో బస్సు ఆపి సమయం, తదితర వివరాలను చెక్ చేశారు. పర్మిట్ కన్నా గంట సమయం ముందు వెళుతుండడంతో ఆ బస్సుకు పది వేలు జరిమానా విధించారు.

మదరసా నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదు

మదనపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినికొండ పంచాయతీ-1 జన్మభూమికాలనీలో మదరసా నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జన్మభూమి కాలనీలోని బసినికొండకు దిగువవైపున 2000 సంవత్సరంలో ఉర్దూస్కూల్ మంజూరైంది. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ అక్కడ పాఠశాల నడుస్తోంది. ఇక్కడి పాఠశాలలో బసినికొండ, రింగురోడ్డు, జన్మభూమి కాలనీ, నక్కలకుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల ఆవరణలో అదనపు గదులు కూడా నిర్మించారు. తాజాగా స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో మదరసా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భూమి చదును చేస్తున్నారు. విషయం


ఉర్దూస్కూల్ ఆవరణలో మదరసా ఏర్పాటుకు చదును చేసిన స్థలం

తెలుసుకున్న స్థానికులు మదరసా ఏర్పాటును వ్యతిరేకిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ అంగన్‌వాడీ భవనం నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నా..ఆలస్యం అవుతోందని, అయితే ప్రభుత్వం ఎప్పుడో నిషేధించిన మదరసాను ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు ఆపేయాలని కోరుతూ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు.

చౌకధర దుకాణాలకు సకాలంలో సరుకులు అందించాలి

- జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం


పౌరసరఫరాల గోదామును తనిఖీ చేస్తున్న డీఎస్‌వో రఘురాం

లక్కిరెడ్డిపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): చౌకధర దుకాణాలకు సకాలంలో సరుకులు అందించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పౌరసఫరాల గోదామును రఘురాం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాలకు సకాలంలో నాణ్యమైన సరుకులను పంపిణీ చేయాలని గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబును ఆదేశించారు. గోదాములో నిలువ చేసిన నిత్యావసర వస్తువుల తయారీ తేదీ, సరుకుల ముగింపు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గోదాము దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబు, డీటీ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రామాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లెలో ఇంటి స్థల విషయం గురించి తనకు న్యాయం జరగలేదని అవమానంతో పురుగుల మందు తాగి నందలూరు బసిరెడ్డి (70) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి వివరాల మేరకు... నందలూరు బసిరెడ్డి ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన దేరంగుల వెంకటమణ అనే వ్యక్తి బసిరెడ్డి ఇంటి ముందు చిల్లర అంగడి పెట్టుకుంటానని విన్నవించాడు. కొంత కాలానికి బసిరెడ్డికి, వెంకట్రమణకు మధ్య విభేదాలు తలెత్తడంతో అంగడిని ఖాళీ చేయమని బసిరె డ్డి వెంకట్రమణకు తెలిపారు. అయితే వారు ఎంత చెప్పినా ఖాళీ చేయకపోవడంతో బసిరెడ్డి పురుగుల మందు తాగినట్లు ఆయన కుమారుడు రామాంజనేయులురెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

రాజంపేటటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ శివారులో ఆటో - బైకు ఢీకొన్న సంఘటనలో వెంకటరమణకు తీవ్రగాయాలయ్యాయి. ఓబులవారిపల్లె మండలం నూకనపల్లెకు చెందిన వెంకటరమణ రాజంపేటకు వస్తుండగా ఆటో వేగంగా వచ్చి బైకును ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటరమణ కాలికి తీవ్ర గాయాలు కాగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గృహ నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి

రైల్వేకోడూరు రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ అనుమతుల అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కుడా ఏపీఓ-2 క్రిష్ణ సింగ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎల్‌టీపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఉపచైర్మన్ ఆదితిసింగ్ ఆదేశాల మేరకు మండలంలోని రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణ అనుమతులను తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేసుకుని పనులు ప్రారంభించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జీఓలపై అధికారులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న కుడా ఏపీవో క్రిష్ణసింగ్

కల్పించారు. అనుమతులు ఉంటేనే నూతనంగా లేవుట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. 300 చదరపు మీటర్లు ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యదర్శి ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. కమర్షియన్ నిర్మాణం కోసం తప్పనిసరిగా కుడా అనుమతులు ఉండాలన్నారు. కేవలం ఒక రూపాయితో 50 చదరపు మీటర్లలో ఇంటి నిర్మాణం చేసుకోవచ్చొన్నారు. ఈ కార్యక్రమంలో జేపీవో ఇందు, ఎంపీడీవో నాగార్జున రావు, ప్లానింగ్ కార్యదర్శి ఎన్.మణయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఉత్కంఠ నడుమ సర్పంచ్ ఓట్ల రీ కౌంటింగ్

- అడ్వకేట్ కమిషనర్ సమక్షంలో నిర్వహణ

వాల్మీకిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీకి సంబంధించి 2021లో జరిగిన ఎన్నికల నాటి ఓట్లకు రీకౌంటింగ్ ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఎన్నికల కౌంటింగ్‌లో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ సర్పంచ్ అభ్యర్థి శ్రీనాథరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ అనంతరం శుక్రవారం వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయంలో అడ్వకేట్ కమిషనర్ ఆనందకుమార్ సమక్షంలో రీ కౌంటింగ్ నిర్వహించారు. వివరాలను హైకోర్టుకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక సీఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్ఐలు, 40 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో మస్తాన్, డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో మనోహర్‌రాజు, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవో రవీంద్రనాథ్, ఏపీవో సునీల్, న్యాయవాదులు, తదితర అధికారులు పాల్గొన్నారు.


2021 నాటి ఓట్లను రీ కౌంటింగ్ చేస్తున్న అధికారులు

మంగంపేట కంకర క్వారీ పరిశీలన

ఓబులవారిపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపేట పరిధిలో ఉన్న కంకర క్వారీని శుక్రవారం జిల్లా మైన్స్ ఏడీ సుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందపల్లె గ్రామస్థులు మాట్లాడుతూ కాలుష్యం కారణంగా పంటలు నష్టపోతున్నామని, దుమ్ము ధూళితో శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నామని ఏడీ దృష్టికి తీసుకవచ్చారు. ఆయన స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈశ్వర్ రాజు, శివప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో గొడవపడి ఓ మహిళ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం, పాలసముద్రం, బోయపల్లెకు చెందిన డ్రైవర్ అశోక్(29)తో కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన మాలరాణి(29) మూడేళ్లుగా సహజీవనం చేస్తోంది. కొంతకాలంగా వారు బెంగుళూరులో ఉంటున్నారు. ఈ మధ్యనే అతను తమ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. కాగా శుక్రవారం ఇద్దరూ మదనపల్లెలో కలుసుకున్నారు. ఆ సమయంలో అశోక్ కాలికి గాయం కావడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో అశోక్ ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆగ్రహించిన ఆమె ఆస్పత్రి నుంచి వెళ్లి బంకులో పెట్రోల్ కొనుక్కుని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కోమటివాని చెరువు కట్టకింద రోడ్డులో శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుంది. ఆమెను వెతుకుతూ అక్కడికి చేరుకున్న అశోక్ మంటలు ఆర్పే ప్రయత్నంలో గాయపడ్డాడు.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆమెను ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో 274 మలేరియా కేసులు

- డీఎంవో రామచంద్రారెడ్డి


బాధితులకు కిట్‌లు అందజేస్తున్న డీఎంవో రామచంద్రారెడ్డి

పుల్లంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 274 మలేరియా కేసులు ఉన్నాయని లక్కిరెడ్డిపల్లెలో 3 కేసులు ఉంటే రాజంపేట డివిజన్‌లో 271 కేసులు జిల్లా మలేరియా అధికారి టి.రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పుల్లంపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పుల్లంపేటలో ఇరువురు మలేరియా బాధితులకు ఎంఎండీపీ కిట్‌లను పంపిణీ చేసి వాడే విధానాన్ని అవగాహన కల్పించారు. అనంతరం పుల్లంపేటలోని వీధుల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. జిల్లాలో 266 రెసిడెన్షియల్ వసతి గృహాలు ఉన్నాయని, దోమల నివారణకు యాంటి లార్వా స్ప్రే చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ చంద్ర, సీహెచ్‌వో రాజు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి కృష్ణమ్మ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుండంలో పడి అఘోరి మృతి

చిట్వేలి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నగిరిపాడు పంచాయతి పెద్దూరు అటవీ ప్రాంతంలోని గుండాలకోన గుండంలో పడి అఘోరి మృతిచెందింది. గత శివరాత్రి సందర్భంగా ఆమె గుండాలకోనను సందర్శించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అఘోరి గురువారం గుండాలకోనకు వచ్చి నిర్మానుష్యమైన ప్రాంతానికి వెళ్లిందని శుక్రవారం గుండంలో శవమై తేలిందని, ఈ విషయం స్థానిక పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అఘోరికి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో శవాన్ని రైల్వేకోడూరు మార్చురిలో ఉంచినట్లు పోలీసులు తెలియజేశారు. అఘోరికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే సీఐ నెం.9121100576, ఎస్ఐ నెం.9121100579కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లెటౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. బి.కొత్తకోట మండలం సుబ్బిరెడ్డిగారిపల్లెలో జి.రవి నుంచి నాలుగు లీటర్లు, టి.ఆనంద్ నుంచి నాలుగు లీటర్లు, కె.వెంకటరమణ నుంచి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. గ్రామంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి 370 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డేర్కాస్, హెచ్‌సీలు మధుసూదన్, పీసీలు వెంకటేశ్, నాగరాజు, మధు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లతో నీటిని నిల్వ చేసుకోవచ్చు



ఫారంపాండ్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

వల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఫారంపాండ్ ఏర్పాటు చేసుకుంటే నీటి నిల్వ ఉంటుందని.. పంటల సాగుకు రైతులు సద్వినియోగం చేసుకోవచ్చని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గోటూరు గ్రామంలో శుక్రవారం ఫారంపాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మాట్లాడుతూ ఫారంపాండ్ ఉపాధి సిబ్బంది తెలిపిన కొలతల ప్రకారం ఈ ఫారంపాండ్‌ను రైతులు తవ్వుకోవాలని సూచించారు. ఇందుకయ్యే ఖర్చులు కూడా ఉపాధి ద్వారానే అందిస్తామని తెలిపారు. అనంతరం ఉపాధి పనులు చేస్తున్న కొంతమంది ఉపాధి కూలీలతో ఆయ న మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి ఉదయాన్నే ఉపాధి పని వద్దకు రావాలని సూచించారు. అనంతరం వారికి తగిన సలహాలు సూచనలు అందించారు. మండలంలో ఈ నెలా ఖరుకల్లా 82 ఫారంపాండ్‌లు పూర్తి చేయాలని ఆదేశించారు. వీరివెంట ఏపీవో సుధారాణి, ఈసీ అంజలి, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా ఎద్దులకు మొదటి బహుమతి



బండలాగుతున్న ఎద్దులు

చాపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో నంద్యాలజిల్లా మిడుతూరు మండలం అలగనూరు గ్రామానికి చెందిన కట్టుబడి రోలి మేడమ్ ఎద్దులు మొదటి బహుమతి రూ.70వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి రెండవ బహుమతి రూ.50వేలు, కడప పట్టణం రూకవారిపల్లె గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి ఎద్దులు మూడవ బహుమతి రూ.40వేలు గెలచుకున్నట్లు తెలిపారు. కేసీకెనాల్ కమిటీ వైస్ ఛైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, గ్రామస్థులు విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, గ్రామంలో రెండు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

చిన్నారి ఘటనను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు, మే 23 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం అయ్యావారి కంబాలదిన్నె గ్రామంలో శుక్రవారం మూడేళ్ల చిన్నారిపై జరిగిన దారుణ ఘటన క్షమించరానిదని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. ఈ ఘటన సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి కుటుంబానికి న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50వేలు సాయం అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాకీ విషయంపై గొడవ...
యువకుడిపై మచ్చుకత్తితో దాడి



గాయపడిన శివరామకృష్ణారెడ్డి

కలసపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువరామాపురంలో బాకీ విషయంపై జరిగిన గొడవలో శివరామకృష్ణారెడ్డి (24) అనే యువ కుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన అంకిరెడ్డి అనే వ్యక్తికి శివరామకృష్ణారెడ్డికి మధ్య డబ్బుల విషయమై కొద్ది రోజుల నుంచి వివాదం జరుగుతోంది. గురువారం రాత్రి శివరామకృష్ణారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి అక్క డ ఉన్న తల్లి నారాయణమ్మ, ఇతర కుటుంబ సభ్యులను అంకిరెడ్డి దూషించి వెళ్లాడు. దీంతో ఆగ్రహానికి గురైన శివరామకృష్ణారెడ్డి తన తల్లితో కలిసి అంకిరెడ్డి ఇంటి వద్దకెళ్లి గొడవపడ్డారు. ఒక్కసారిగా మచ్చుకత్తితో శివరామకృష్ణారెడ్డిపై అంకిరెడ్డి దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావడంతో శివరామకృష్ణారెడ్డిని కడప రిమ్స్‌కు.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. విషయం తెలుసుకున్న కలసపాడు పోలీ సులు బాధతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి



రాహుల్ మృతదేహం

చెన్నూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆమంచి రాహుల్ (18) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరుకు చెందిన రాహుల్ తన స్నేహి తుడు రాజేశ్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో కడపకు వెళుతుండగా శేషయ్యగారిపల్లె సమీపంలో ముందు వెళుతున్న మినీ లారీని అదుపు తప్పి ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలి సిందే. వీరిని కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాహుల్ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రైతు బజార్‌లను సద్వినియోగం చేసుకోవాలి

● వేంపల్లె రైతు బజార్‌పై కలెక్టర్‌తో చర్చిస్తా..సీఈఓ

● ఆంధ్రజ్యోతి కథనంపై సాగిన చర్చ



వేంపల్లెలో రైతు బజార్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ మాధవీలత

వేంపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 125 రైతు బజార్‌లు ఉన్నాయని... రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకువచ్చి రైతు బజార్‌లలో విక్రయించుకోవచ్చని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) మాధవీలత పేర్కొన్నారు. వేంపల్లెలో నూతనంగా నిర్మించి నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. రైతు బజార్‌ల ఎస్టేట్ అధికారిణి రుచిత, ఇతర అధికారులతో మాట్లాడారు. వేంపల్లెలో రైతు బజార్ నిరుపయోగంగా ఉండటానికి గల కారణాలపై సీఈవో ఆరాతీశారు. ఈసందర్భంగా శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'రూ.1.20 కోట్ల ప్రజాధనం వృథా' కథనంపై చర్చించారు. రైతుబజార్‌ను వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చొరవ చూపాలనే విషయంపై సీఈఓ మాట్లాడుతూ రైతుబజార్‌ను తెరిపించేందుకు కలెక్టర్, డీపీఓతో చర్చిస్తామన్నారు. త్వరలోనే ఉపయోగంలోకి తెచ్చేలా చూస్తామన్నారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ రైతులకు మేలు జరగాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం రైతు బజార్‌లను ఏర్పాటు చేస్తోందని, తమ ఉత్పత్తులను తెచ్చుకొని ఉచితంగా స్టాల్స్‌లో అమ్ముకోవచ్చన్నారు. ఈ సందర్భంగా బీజే పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ సీఈఓ మాధ వీలతకు వినతిపత్రం సమర్పించారు. ఏడాదిగా మూతపడి ఉన్న రైతుబజార్‌ను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రూ.62 కోట్లతో బ్రిడ్జి పనులకు తిరిగి శంకుస్థాపన



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లె గ్రామం వద్ద రూ.62 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తిరిగి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు తాను గండికోట ముంపు సమస్యలపై పాదయాత్ర చేశానని టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రిడ్జి పనులు చేపడతామని హామీ ఇచ్చానన్నారు. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే బ్రిడ్జి పనులను తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గండికోట బ్యాక్‌వాటర్ పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు సంకేపల్లె చుట్టూ ఎనిమిది గ్రామాల ప్రజలు 50 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందన్నారు. ప్రజల ఇబ్బందిని గమనించి 2019వ సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వంలో అప్పుడు మంత్రిగా ఉన్న తన బాబాయి ఆదినారాయణరెడ్డి చొరవతో రూ.34కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభించారన్నారు. బ్రిడ్జి పనుల్లో పిల్లర్లు వేసిన తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు జరగకుండా ఎంపీ, అప్పటి ఎమ్మెల్యే అడ్డుకున్నారన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో తాను, తన బాబాయి పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.62 కోట్లతో తిరిగి పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు రామాంజులరెడ్డి, ఎంపీటీసీ రామమునిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నరసింహారెడ్డి, బాబురెడ్డి, గోరుశెట్టిబాబు, రాఘవేంద్రారెడ్డి, రమణారెడ్డి, మాధవరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కారులో అన్నింటా జిల్లాకు అన్యాయం

● మహానాడులో న్యాయం జరిగేలా తీర్మానం చేయాలి ● పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి) కూటమి సర్కారు ఏర్పడిన 11 నెలల పాలనలో జిల్లాకు అన్నింటా అన్యాయం జరిగిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో జిల్లాలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉండేవారని, చంద్రబాబు పాలనలో జిల్లా నుంచి కనీసం ఒక్కరికీ కూడా మంత్రి పదవి ఇవ్వకుండా జిల్లా అభివృద్ధికి అడ్డు పడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మూడు దఫాలుగా కొండవీటి చాంతాండంత నామినేటెడ్ పదవులు ప్రకటించారని, జిల్లాకు చెందిన ఒక్కరికి కూడా పదవి దక్కలేదన్నారు. అంతే కాకుండా టీటీడీ బోర్డులో కూడా జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. కడపలో జరగనున్న మహనాడు లోనైనా కొన్నింటికైనా పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇక పోతే గత ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ జీవో 85 జారీ చేసిందన్నారు. ఆ జీవోను కూటమి సర్కారు రద్దు చేయకపోగా పకడ్బందీగా అమలు చేస్తోందని విమర్శించారు. ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలిగేలా మహానాడులో నైనా జీవో 85ను రద్దు చేయాలన్నారు. విభజన చట్టం హామీల అమలులో భాగంగా జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం, బుం దేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ డిమాండ్లను నెరవేర్చాల న్నారు. ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కడప- రాయచోటి, మదనపల్లి, బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం పనులు ఆగాయన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారి పనులు మొదలు చేయడంలో కూటమి సర్కారు విఫలమయ్యిందని ఎద్దేవా చేశారు. తెలుగుగంగ, గాలేరు నగరి, వెలిగొండ ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగ ళి అక్కడే అన్నట్లుగా ఉందని విమర్శించారు. జిల్లా అభివృద్ధికి ఏమి చేయ దలచారో మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు అఫ్జల్‌ఖాన్, అశోక్ కుమార్‌రెడ్డి, సిరాజుద్దీన్, భువన్‌రెడ్డి, రఫీక్‌ఖాన్, సంఘ సేవకులు సలా ఉద్దీన్, మామిళ్ల బాబు, ఎస్ఏ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో అదుపు తప్పిన బస్సు



గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద అదుపు తప్పిన బస్సు

సీకేదిన్నె, మే 23 (ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు ఘాట్‌లో ఓ ప్రైవేటుట్రావెల్స్‌కు చెందిన బస్సు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. రాయచోటివైపు నుంచి కడపకు వస్తున్న బస్సు గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద గురువారం రాత్రి అదుపు తప్పి మట్టికుప్పపైకి ఎక్కి ఆగిపోయింది. దీంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. కాగా, బస్సు తిరుపతిలో అపహరణకు గురైనట్లు, చోరీకి గురైన బస్సు గురువారం రాత్రి గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద ప్రమాదానికి గురై ఆగిపోవడంతో నిందితుడు బస్సు అద్దాలు పగులకొట్టుకుని పారిపోయినట్లు తెలిసింది. ఘటనపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బండ్లకు ఇక చెల్లు

● డీలర్ల వద్దనే రేషన్ పంపిణీ

● వచ్చే నెల నుంచి అమలుకు చర్యలు



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పులివెందుల టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ నిత్యావసర వస్తువులు పంపిణీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఎండీయూ వాహనాలు అందుబాటులో తెచ్చింది. కార్డుదారులకు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో 2020 ఫిబ్రవరిలో ఈ వాహనాలు ఏర్పాటు చేశారు. అయితే ఆచరణలో మాత్రం పలుచోట్ల వీధుల్లో కూడా సరుకులు పంపిణీ చేయలేకపోయింది. ఎండీయూ ఆపరేటర్లుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలే ఉండడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా ప్రజా పంపిణీ వ్యవస్థ తయారైంది. డీలర్లకు పని లేకుండా చేయడంతో పాటు నిత్యం సర్వర్ సమస్యతో కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందేవి కావు. దీనిపై పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత రెండురోజుల క్రితం పౌర సరఫరాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టత కూడా ఇచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న వాహనాలను కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు అప్పగించాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జూన్ నుంచి రేషన్ డిపోల నుంచే సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. దీంతో జిల్లాలో ఉన్న 366 వాహనా లకు ఇక కాలం చెల్లింది.

జూన్ 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1239 చౌకదుకాణాల ద్వారా 5,78,685 లక్షల మందికి కార్డుదారులకు సరుకులు అందించేలా ప్రణాళిక రూపొందిస్తుంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నెలంతా రేషన్ దుకాణాలు పనిచేసేలా చర్యలు చేపట్టడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే సరుకులు అందించేలా చర్యలు చేపడుతుంది. ఇప్ప టికే డిపోలు ఎక్కడున్నాయో చాలా మంది కార్డుదారులు తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి సూచించారు. దీంతో చౌకదుకాణాలను డీలర్లు శుభ్రం చేసే పనిలో పడ్డారు. స్థానిక ప్రజలను పిలిచి డిపోలను ప్రారంభించనున్నారు. దీంతో పాత విధానం అమలులోకి రానుంది. నేరుగా కార్డుదారులు డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంది. కానీ పట్టణ ప్రాంతంలో మాత్రం డిపోలు ఎక్కడున్నాయో తెలుసుకోవడం కష్టం. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. అవినీతి అక్రమాలకు తావు లేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై ఆఫీసరు పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా నూతన యాప్‌తో పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు.

కూటమి పాలనలోనే
ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ నాగరాజు

కడప మారుతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించడం జరిగిందని ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సముదాయ భవనంలోని ఆయన ఛాంబరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామనే సాకుతో దాదాపు 48వేల కుటుంబాల చిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. చిన్న చిన్న కారణాలను సాకు గా చూపి ఉద్యోగులను (కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, ఇతర చిరుద్యోగులు) పనిష్‌మెంట్లు, సస్పెండ్లు, రిమూవ్ చేస్తూ వారిని తీవ్ర మనోవేదనకు గురయ్యేలా చేశారన్నారు. చాలామంది ఉద్యో గులు ఈ విషయం తన దృష్టికి తీసుకురావడంతో ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరామన్నారు. ఆ మేరకు వారు స్పందించి 2019 నాటి జీవోను తిరిగి ఈనెల 22న రాత్రి నుంచి అమల్లోకి తీసుకువచ్చారన్నారు. కాగా, చిత్తూరు, మంత్రాలయం రూట్లలో కేఎస్ఆర్టీసీలో ఏపీ సీనియర్ సిటి జన్లకు రాయితీ సౌకర్యం కల్పించాలని ఇటీవల కర్ణాటక రాష్ట్ర రవాణ శాఖ మంత్రిని కోరామన్నారు. సమావేశంలో ఆర్టీసీ కార్మిక పరిషత్ జోనల్ నాయకులు పురుషోత్తం పాల్గొన్నారు.

గుంజన నదికి రక్షణ గోడ నిర్మించాలని దీక్ష



గుంజననదిలోనే దీక్ష చేస్తున్న డాక్టర్ సయ్యద్ అహ్మద్

రైల్వేకోడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): గుంజననదికి రక్షణగోడ నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం గుంజననదిలోనే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా శాంతినగర్, నరసరాంపేట వద్ద రక్షణ గోడ నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు గుంజననది ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. దీంతో ప్రతి ఏటా శాంతి నగర్, నరసరాంపేట ప్రాంతాలు కోతగురై ఇళ్లు దెబ్బతింటున్నాయన్నారు. కాగా రైల్వేకోడూరుకు శనివారం పార్టీ సీనియర్ నేత తులసిరెడ్డి వచ్చి దీక్ష చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

జగన్‌కు లిక్కర్‌స్కాం భయం పట్టుకుంది

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు

రాజంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లిక్కర్‌స్కాం భ యం పట్టుకుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం వ్యవహరించారన్నా రు. ఆర్థిక నేరాలకు కేరాఫ్ అడ్రస్ జగన్‌రెడ్డి అండ్ కో అన్నారు. నాడు చేసిన ఆర్థిక నేరాలకు నేడు పరాకాష్ట వహించాల్సి వస్తుందని, ముందుగానే మీడియా ముందుకు వచ్చి తాను హరిశ్చంద్రుడని, తనకు ఏమీ సంబంధం లేదని తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మద్యపానం నిషేధిస్తామని చెప్పి మోసంచేసి అధిక రేట్లకు అమ్మి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీవీ రమణ, బీజేపీ రాష్ట్ర నాయకులు హిమగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సోమేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తంబళ్లపల్లె, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సోమేశ్వర స్వామి ఆలయ 25వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచే ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో అర్చకుడు మహేష్ కలశపూజ, నవగ్రహ పూజ, వాస్తు, దిక్పాలక పూజ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్ర , శ్రీసూక్త, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు, మహా కుంబాబిషేకం నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తంబళ్లపల్లె పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాలొన్నారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

వైభవంగా దండుమారెమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ

తంబళ్లపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ దేవర బురుజులో దండుమారెమ్మ ఆలయ జీర్ణోద్ధరణ, మహాకుంభ సంప్రోక్షణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం దండుమారెమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట, మహా కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరగలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పెద్దమండ్యం, మే 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ బందెప్ప రెడ్డి గారి పల్లెలో శుక్రవారం ఇరగలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అన్నదానం చేశారు. సాయం త్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీడీపీ సమన్వయకర్త సీడ్ మల్లికార్జునాయుడు, అలయ నిర్వాహకులు శంకరరెడ్డి, టీడీపీ నేతలు కుంటకిందపల్లి చంద్రారెడ్డి, ఓబులురెడ్డి, సుమన్ కుమార్, వేణు గోపాల్ రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రమణ ప్ప, విశ్వనాధరెడ్డి, రఘునాథరెడ్డి, గంగాధర, మహేశ్వర పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు పూజలు

మదనపల్లె అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం పూజలు నిర్వహించారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు చేశారు. అనంతరం వస్త్రాలు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ

మదనపల్లె టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మదనపల్లె మండలానికి చెందిన ప్రదీప్ అత్యుత్తమ ప్రతిభ కనపరిచాడు. శుక్రవారం విడుదలైన ఈ పరీక్ష ఫలితాల్లో మదనపల్లె మండలం చీకిలబైలు గ్రామానికి చెందిన మండెం రవీంద్ర కుమారుడు ప్రదీప్ 278/300 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రదీప్‌ను అభినందించారు.

చినుకు పడితే బురదమయం


రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వాల్మీకిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని నిమ్మనపల్లె బస్టాండ్ ప్రాంతం కాసింత వర్షానికే జలమయమవుతోంది. స్థానిక జామియా మసీదు సమీపంలో వర్షపు నీరు రోడ్డుపై చేరి దుర్గంధభరితంగా మారుతుండడంతో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా జంతు వధశాల స్థలం


నాయక్ వీధిలోని గ్రామ పంచాయతీ స్థలం

వాల్మీకిపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాయక్ వీధి ప్రాంతంలో ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన జంతు వధశాల స్థలం వినియోగంలో లేకపోవడంతో క్రమేణా అన్యాక్రాంతమవుతోంది. 35 ఏళ్లుగా జంతువధశాలగా వినియోగించిన ఈ స్థలం ప్రస్తుతం వినియోగంలో లేక పోవడంతో, ప్రస్తుతం గాంధీ బస్టాండ్ ప్రాంతంలో ఎవరికి తోచిన స్థలంలో వారు మాంసపు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటుండడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. ఈ స్థలాలపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

పట్టణంలోని నాయక్‌వీధిలోని గ్రామ పంచాయతీ జంతువధ శాల స్థలాన్ని పరిశీలించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఈవో రంవీంద్రనాథ్ తెలిపారు. గాంధీ బస్టాండ్ ప్రాంతం లో మాంసపు దుకాణాలు శుభ్రత పాటించకపోతే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. ఇకపై ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తామని తెలిపారు

కడప చరిత్రలో నిలిచిపోయే విధంగా మహానాడు

- టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


కడపలో మంత్రులతో కలిసి మహానాడు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మే 23 (ఆంధ్రజ్యోతి): కడప చరిత్రలో నిలిచిపోయే విధంగా కడపలో మహానాడు నిర్వహిస్తున్నట్లు తంబళ్ళపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. కడపలో మహానాడు ఏర్పాట్లను శుక్రవారం మంత్రులు జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడుకు దిగ్విజయం కోసం సమాయత్తం అవుతున్నామన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ కుటుంబ సభ్యులు కడపలో జరిగే మహానాడుకు హాజరవుతారన్నారు. ఇందుకోసం శనివారం ములకలచెరువులోని తంబళపల్లె నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, పలువురు నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

నేడు ములకలచెరువులో మినీ మహానాడు

మండల కేంద్రంలోని కేజీఎన్ కల్యాణమండపంలో శనివారం టీడీపీ మినీ మహానాడు జరగనుంది. మినీ మహానాడుకు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులందరూ హాజరుకావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజా వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, నాయకులు చాంద్‌బాషా పాల్గొన్నారు.

మహానాడు కు తరలిరండి

బి.కొత్తకోట : ములకలచెరువు మండలంలోని కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించనున్న మినీ మహానాడుకు కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బి.కొత్తకోటలోని ఈమె స్వగృహంలో పట్టణ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినీ మహానాడు సభకు వచ్చే ప్రతి నాయకుడు, కార్యకర్త తమకు పార్టీ ఇచ్చిన సభ్యత్వం కార్డును ధరించి రావాలని కోరారు. అదే స్ఫూర్తితో ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే టీడీపీ వేడుక మహానాడుకు టీడీపీ కుటుంబసభ్యులందరూ తరలివచ్చి సత్తా చాటాలని కోరారు. చావిడికిట్టన్న, లోకనాథరెడ్డి, యండీ మస్తాన్, సిద్దారెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూన్ నుంచి రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ధనుంజయలు


బి.కొత్తకోట తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె అర్బన్, మే23(ఆంధ్రజ్యోతి):జూన్ నుంచి ప్రతి తెల్లరేషన్ కార్డు దారుడికి చౌకదుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మదనపల్లె తహసీల్ధార్ ధనుంజయలు తెలిపారు. శుక్రవారం ఆయన చౌకదుకాణాల డీల్లర్‌తో స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి రేషన్ డీలర్ జూన్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు అందుబాటులో ఉంటూ నిత్యావసర సరుకులు కార్డుదారులకు పంపిణీ చేయాలని సూచించారు. ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్ణీత సమయంలో రేషన్ పంపిణీ చేయాలన్నారు. మదనపల్లె పట్టణం, మండలంలోని 101 రేషన్ డీలర్ షాపులు ఉన్నాయని, వాటి పరిధిలో ఉన్న రేషన్ కార్డుదారులు రేషన్ షాపుల వద్దకు వెళ్లి నిత్యావసరాల సరుకులు పొందాలన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. సీఎస్‌డీటీ ఫిరోజ్, డీలర్లు మౌలాలి, రాజన్న, కళాధర్, ఇమామ్‌ఖాసీం, మురళి. కృష్ణమూర్తి, ప్రభాకర్, రఘు, నయన్‌తాజ్, భాగ్యమ్మ, అనసూయ, దాక్షాయని, తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల దూరం తగ్గించండి

బి.కొత్తకోట: పట్టణపరిధిలో నివాసముంటున్న తమను పల్లెల్లోని చౌకదుకాణాల నుంచి వేరు చేసి పట్టణంలోని దుకాణాలకు మార్చాలని హడ్కోకాలనీ, పంజూరమ్మవీధి, బోయవీధికి చెందిన పలువురు శుక్రవారం తహసీల్దార్ అజారుద్దీన్, సివిల్‌సప్లైస్ డీటీ వెంకటరెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణానికి చెందిన సుమారు 160 కుటుంబాల వారి రేషన్‌కార్డులు తాకాటంవారిపల్లి, జనుపువారిపల్లిల్లోని చౌకదుకాణాల పరిధిలో ఉన్నాయన్నారు. వారంతా పల్లెలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. వాహనాల ద్వారా రేషన్‌సరఫరా చేసేటప్పుడు ఇబ్బందిలేకుండా ఉండేదని, ప్రస్తుతం వాటిని రద్దుచేయడంతో చౌకదుకాణాలకు వెళ్లకతప్పదన్నారు. పట్టణంలోని దుకాణాలకు వెళితే మీ కార్డులకు అలాట్‌మెంట్ లేదని డీలర్లు అంటున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ హామీఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అష్రఫ్అలీ, తంబయ్యశెట్టిలతో పాటు పలువురు కార్డుదారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులను బృందావనాలుగా తీర్చిదిద్దాలి


నిమ్మనపల్లె: గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్


రంగసముద్రం డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

పెద్దతిప్పసముద్రం మే 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి ఆ చెత్త ద్వారా సంపదను సృష్టించడంతోపాటు డంపింగ్ యార్డులను బృందావనాలుగా తీర్చిదిద్దాలని ప్రత్యేక అధికారి భరత్ కుమార్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని రంగసముద్రం పంచాయతీలో ఉన్న డంపింగ్ యార్డును ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌తో కలిసి పరిశీలించారు. డంపింగ్ యార్డు లో మొక్కల పెంపకం వాటి నిర్వహణ, తడి చెత్త పొడి చెత్త విభజనపై కార్యదర్శులకు పలు సూచనలిచ్చారు. స్థానికుల ఇళ్ల వద్దకు వెళ్లి పంచాయతీ అధికారుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్యంపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నిమ్మనపల్లి : చెత్తను క్రమం తప్పకుండా డంపింగ్‌యార్డ్‌లకు తరలించి సంపదను సృష్టించాలని ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ సూచించారు. శుక్రవారం తవళం గ్రామ పంచాయతీలో చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెత్తను వినియోగించి తయారు చేసిన ఎరువులను రైతులను తక్కువ ధరకు విక్రయిస్తే పంచాయతీలకు లాభం చేకూరుతుందని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రతి రోజూ ఇంటిటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డ్‌లలో వేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్రపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధం చేయాలని తెలిపారు. పెండింగ్‌లో వున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, ఎంఈవో-1 పద్మావతి, ఏపీఎం రమేష్, ఏపీవో మురళి, కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం


పీలేరు: యోగా శిక్షణ పొందుతున్న గ్రామస్థులు

పీలేరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం రోజుకు అరగంట పాటు యోగా సాధన చేస్తే మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ పీ.వీ.ఎస్ లక్ష్మి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో బాగంగా పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించే మార్గాలలో సర్వోన్నతమైంది యోగా అని చెప్పారు. చక్కని శరీర సౌష్టవం లభిస్తుంద న్నారు. దైనందిన జీవితంలో యోగా ఒక బాగం కావాలని సూచించారు. షుగర్. బీపీ తదితర వ్యాధులతో బాధపడేవారు యోగాతో రిలీఫ్ పొందవచ్చునని చెప్పారు. అనారోగ్యం దరిచేరకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ ఈవో గురుమోహన్, సచివాలయ కార్యదర్శులు జ్ఞానశేఖర్, సంయుక్త, బావాజాన్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ. యోగాతో ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో నాగసుబ్బరాయుడు, వైద్యాధికారి అనుపమ, ఏవో రమణకుమార్, ఏపీయం గంగాదర్, ఏపీవో అంజినప్ప, హౌసింగ్ ఏఈ సుజాత, ఏఈఈ వినోద్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : యోగాంధ్ర కార్యక్రమంలో బాగంగా ఈ నెల 28న నిర్వహించే జిల్లా స్థాయి యోగా డేను విజయవంతం చేయాలని పీలేరు ఎంపీడీవో శివశంకర్, తహసీల్దార్ భీమేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవం వరకూ రోజువారీ యోగా కార్యక్రమాలపై చర్చించారు. జిల్లా నుంచి ఇద్దరు యోగా శిక్షకులు వస్తారని, వారితో పట్టణాలతోపాటు గ్రామీణ స్థాయి వరకూ యోగా ఆవశ్యకతను వివరించాలని నిర్ణయించారు. ప్రతి సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీలలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి రోజువారీ కార్యక్రమాల వేగం పెంచాలని నిర్ణయించారు. పీలేరు మండలం నుంచి 28న జరిగే జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంఈవో పద్మావతి, ఎస్ఐ లోకేష్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : నగరపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నగరపంచాయతీ కమీషనర్ జీవీ పల్లవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21నుంచి జూన్21 వరకు యోగా మాసంగా ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉదయం 6నుంచి యోగా తరగతులు నిర్వహించనున్నట్లు కమీషనర్ తెలిపారు.

సారా తయారీ మానుకోకపోతే పీడీ యాక్ట్

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్


మేకలవారిపల్లెలో ఇంటింటా అవగాహన కల్పిస్తున్న ఈఎస్ మధుసూదన్

వాల్మీకిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయా రీ, విక్రయాలు మానుకోని పక్షంలో పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ హెచ్చరించారు. శుక్రవారం వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో నవోదయం 2 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఎగువ మేకలవారిపల్లెలో ఇంటింటా తిరుగుతూ నాటుసారా మహమ్మారితో అనర్థాలు, కష్టనష్టాలపై అవగాహన కల్పించారు. నాటుసారా తయారీ విక్రయాలు మానుకుని ఉపాధి పనుల ద్వారా గౌరవంగా బతకాలన్నారు. .కాగా, తమకు రుణాలు మంజూరు చేయిస్తే వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను చక్కగా పోషించుకుంటామని ఈ సందర్భంగా పలువురు విన్నవించగా, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని ఏఈఎస్ హామీ ఇచ్చారు. తరిగొండలోని తనిఖీలు నిర్వహించారు. వాల్మీకిపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నాటుసారా తయారీ, విక్రయాలను పూర్తిగా రూపు మాపే దిశగా స్థానిక అధికారులు, సిబ్బంది బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ లత, ఎస్ఐ సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు సురేష్ కుమార్

మదనపల్లె అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మదనపల్లె మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్ కుమార్ మాట్లాడారు. నాలుగు నెలల నుంచి జీతాలు అందకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐతోపాటు, నెలకు రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. పట్టణ జనాభాను బట్టి కార్మికులను పెంచాలన్నారు. మే 20 న నిర్వహించాల్సిన సార్వత్రిక సమ్మె జూలై 9వ తేదీకి వాయిదా పడిందన్నారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ, మధు, ఓబులేశ్, శేఖర, శ్రీరాములు, ప్రమీల, అన్నపూర్ణ, అనూరాధ, ఈశ్వరమ్మ, శివ, తదితరులు పాల్గొన్నారు.

'మార్కెట్ యార్డులో వసతుల కల్పనకు కృషి'

పీలేరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, అనవరస ఖర్చులను తగ్గించి రైతులు, వ్యాపారుకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని పీలేరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి అన్నారు. శుక్రవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈ నెల 22న పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. మహానాడు అనంతరం మరోమారు ఎమ్మెల్యేతో చర్చించి అందరికీ తెలియజేస్తామన్నారు. పశువులు, గొర్రెల సంత ఆదాయ వ్యయాలను పరిశీలించి రైతులు, వ్యాపారులను దృష్టిలో పెట్టుకొని సంత ఆవరణలో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

సమస్యల పరిష్కారంలో ఎన్ఎంయూ అలుపెరగని పోరాటం


గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఎన్ఎంయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు

పీలేరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎన్ఎంయూ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ యూనియన్ పీలేరు డిపో అధ్యక్షుడు సీవీ. రమణ తెలిపారు. శుక్రవారం పీలేరు ఆర్టీసీ డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత వైద్య విధానాన్ని తిరిగి అమలు చేస్తూ సంబంధిత డాక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమన్నారు. 2019 సర్క్యులర్‌ను పునరుద్ధరించడం ఎన్ఎంయూ విజయంగా అభివర్ణించారు. ఇకపై కొనే కొత్త బస్సులను ఆర్టీసీ సంస్థ కొనే విధంగా హామీ లభించిందన్నారు. ఇన్నాళ్లు ప్రయాణికులు టికెట్ తీసుకోక పోతే సంబంధిత కండక్టర్‌పై చర్యలు తీసుకునేవారని, ఇకపై టికెట్ తీసుకోవాల్సిన బాధ్యత ప్రయాణికులదేనని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఎంయూ పలు డిమాండ్‌లను ప్రభుత్వం, సంస్థ ఎండీ దృష్టికి తీసుకెళ్లగాఎండీ, ఈడీలు సానుకూలంగా స్పందించడం అభినందనీ యమన్నారు. ఈ సమావేశంలో డిపో కార్యదర్శి జీ. ఆదినారాయణ, కోశాధికారి రఘు, నాయకులు సుబ్బరామయ్య, రామయ్య, దాము, జీవీ రమణ తదిరలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర


హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

పీలేరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. సదుం మార్గంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు, అభిషేకాల అనంతరం ఊరేగింపు ప్రారంభించారు. పాతబస్టాండ్, తిమ్మారెడ్డి క్రాస్, అజంతా మిట్ట, పంచాయతీ కార్యాలయం, మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకూ శోభాయాత్ర నిర్వహించారు. కోలాటాలు, చెక్క భజనలు, పిల్లనగ్రోవులు, బళ్లారి డ్రమ్స్ ఆకట్టుకున్నాయి. దారి పొడవునా స్వామి వారికి పట్టణ ప్రజలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజు స్వామి, కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహనకు కళాజాతా


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న టీబీ యూనిట్ సిబ్బంది

మదనపల్లె అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడానికి మదనపల్లె పట్టణం, రూరల్ ప్రాంతాల్లో మదనపల్లె టీబీ యూనిట్, ఆర్ఆర్ఎస్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈశ్వరమ్మ కాలనీ, నీరుగట్టువారి పల్లె టమోటా యార్డు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బొమ్మనచెరువు, అమ్మచెరువు మిట్ట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణాఖాన్ ఆరోగ్య సిబ్బంది వగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎంపీహెచ్‌వో రెహమాన్, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, టీబి విభాగం సిబ్బంది ప్రభాకర్, సుశీల, వనజకుమారి, తరుణ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలను వివరిస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె, మే 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ లోకేశ్ రెడ్డి వాహనదారులకు సూచించారు. శుక్రవారం తంబళ్లపల్లె-మదనపల్లె రహదారిలో కురవపల్లె బస్టాప్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదన్నారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు వెళ్లకూడదని, తల్లితండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని కోరారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా బండి నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి రూల్స్ పాటించని పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు. తనిఖీలలో పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులతో సాంకేతిక పరిశోధనలు

మదనపల్లె టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సదస్సులతో సాంకేతిక పరిశోధనలు సాధ్యమని ప్రొఫెసర్ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 46 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు 100 పత్రాలు సమర్పించారు. ఇందులో దుబాయ్, ఐర్లాండ్, ఇండియా నుంచి వచ్చిన 80 పత్రాలు ఎంపికై ఐఎస్‌బీఎస్ నెంబర్లతో సదస్సు సమావేశ గ్రంథంలో ప్రచురించారు. వీటిలో మిషన్ లర్నింగ్, ఏఐ, క్రిప్టోగ్రఫీ, నానో టెక్నాలజీ, మెటీరియల్ సైన్సు రంగాల్లో ఆధునిక సాంకేతిక అధ్యయనాల పై చర్చించారు. ఈ సదస్సులో కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, కో ఆర్డినేటర్లు అమరనాథరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, దేవిక, విద్యార్థులు పాల్గొన్నారు.